

ఆలయాలకు పాలకమండళ్లపై కసరత్తు షురూ



- టీడీపీ అధిష్ఠానం సూచనతో జాబితాలు సిద్ధం చేస్తున్న ఎమ్మెల్యేలు
- కుప్పంలో ఒక్కోదానికి మూడు కమిటీల సిఫారసు
- ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్న ఆశావహులు
- జనసేన, బీజేపీ నాయకులకూ అవకాశం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దశలవారీగా నామినేటెడ్ పోస్టుల్ని భర్తీ చేస్తున్నారు. జిల్లావాసులకు టీటీడీ చైర్మన్, ఆర్టీసీ వైస్ చైర్మన్ వంటి పదవులు దక్కిన విషయం తెలిసిందే. జిల్లాస్థాయిలో ఇంకా చాలా పోస్టులు ఖాళీగా ఉన్నా భర్తీకి నోచుకోలేదు. ఇటీవల టీడీపీ అధిష్ఠానం ఆలయాలకు పాలకవర్గాలను నియమించేందుకు పేర్లను సిఫారసు చేయాలని సూచించింది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఉన్న ఆలయాలకు పాలకమండలి కోసం పేర్లతో జాబితాను సిద్ధం చేస్తున్నారు. కూటమిలోని జనసేన, బీజేపీ నాయకులకు కూడా అవకాశం కల్పిస్తున్నారు. అలాగే గత ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేసిన శ్రేణులకు న్యాయం చేసేందుకు కులాలవారీగా బ్యాలెన్సు చేసుకుని జాబితా తయారు చేయాలని అధిష్ఠానం సూచించింది. ఆ మేరకు ఎమ్మెల్యేలు జాబితాలు సిద్ధం చేస్తున్నారు.

● పూతలపట్టు నియోజకవర్గంలో సుప్రసిద్ధ కాణిపాకం, అరగొండ అర్ధగిరి ఆలయం, బంగారుపాళ్యంలో మొగిలీశ్వరాలయం ఉన్నాయి. ఈ మూడు చోట్ల కమిటీల నియామకానికి ఎమ్మెల్యే మురళీమోహన్ ఆయా మండలాల నాయకులతో చర్చించి జాబితా సిద్ధం చేశారు. అధిష్ఠానానికి కూడా పంపించేసినట్లు సమాచారం.

● చిత్తూరులో గిరింపేట దుర్గమ్మ, దొడ్డిపల్లె సప్తకన్నికలమ్మ, కోదండరామస్వామి దేవాలయం, అగస్త్యేశ్వర కామాక్షి సమేత ఆలయం, శివ షణ్ముగ ఆలయం, సుందర వినాయక స్వామి దేవస్థానం, వీరాంజనేయస్వామి దేవస్థానం, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం, తేనెబండ ముత్యాలమ్మ దేవస్థానం,పొన్నియమ్మ ఆలయం,కట్టమంచి కులందీశ్వరాలయం, కాశీ విశ్వేశ్వరాలయం (రాజు గుడి) వంటి ఆలయాలున్నాయి. వీటన్నింటికీ కమిటీలను నియమించేందుకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆయా డివిజన్ల ఇన్‌చార్జుల అభిప్రాయాలు తీసుకుని కసరత్తు చేస్తున్నారు.

● జీడీనెల్లూరు నియోజకవర్గం విషయానికొస్తే.. కార్వేటినగరం మండలంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, ఎస్ ఆర్ పురం మండలంలోని ఆరిమాకులపల్లె గంగమ్మ గుడి ఉన్నాయి. ఎమ్మెల్యే థామస్ ఆధ్వర్యంలో గంగమ్మగుడి కమిటీ నియామకానికి జాబితా సిద్ధం చేయగా, సుబ్రహ్మణ్యస్వామి ఆలయం విషయంలో చర్చలు జరుగుతున్నాయి. పెనుమూరు మండలంలోని కలిగిరి కొండ వెంకటేశ్వరస్వామి ఆలయం టీటీడీ పరిధిలో ఉండడంతో దానికి పాలకవర్గం నియమించడం లేదు.

● పలమనేరు నియోజకవర్గంలో పలమనేరులోని తిరుపతి గంగమ్మ గుడి, కాశీవిశ్వేశ్వరాలయం, సత్యగంగమ్మ గుడి, బైరెడ్డిపల్లెలోని ధ్యానాభిరామ ఆలయం (కార్వేటికొండ) ఉన్నాయి. ఇంకా పాలకవర్గాల జాబితా తయారీకి కసరత్తు ప్రారంభం కాలేదు. నేడో రేపో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి ఆధ్వర్యంలో జాబితా తయారీ ప్రక్రియ ప్రారంభం కానుంది.

● పుంగనూరు నియోజకవర్గంలో శక్తిక్షేత్రంగా పేరొందిన బోయకొండ గంగమ్మ ఆలయం,పుంగనూరులోని నెక్కుంది అగస్త్యేశ్వర స్వామి ఆలయం, చౌడేపల్లెలోని మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం ఉన్నాయి.నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జాబితా తయారీ పనులు జరుగుతున్నాయి.రెండ్రోజుల్లో జాబితా సిద్ధం చేసి అధిష్ఠానానికి పంపిస్తామని చల్లా అంటున్నారు.

● కుప్పంలో భిన్నంగా జాబితాల తయారీ

కుప్పం నియోజకవర్గంలో జాబితా తయారీ భిన్నంగా జరుగుతోంది. ఎమ్మెల్యేలున్న చోట్ల వారే నేరుగా జాబితా తయారుచేసి పంపిస్తుండగా.. కుప్పంలో మాత్రం ఒక్కో ఆలయానికి మూడు జాబితాలను సిఫారసు చేశారు. కుప్పంలోని గంగమ్మ ఆలయం, గుడుపల్లెలోని గుడివంక సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలకు మూడేసి చొప్పున జాబితాలను తయారుచేసి సీఎం బ్యాక్ ఆఫీసుకు పంపించారు. చంద్రబాబు కుప్పం ఎమ్మెల్యే హోదాలో మూడు పేర్ల నుంచి ఓ పేరును ఎంపిక చేయనున్నారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునితర్నం ఆధ్వర్యంలో జాబితాలు తయారయ్యాయి.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

దాడి కేసులో తండ్రీకొడుకులకు ఐదేళ్ల జైలు



శ్రావణ్‌కుమార్, సుబ్రహ్మణ్యం

చిత్తూరు లీగల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): దాడి కేసులో తండ్రీకొడుకులకు ఐదేళ్ల జైలుశిక్ష పడింది. బంగారుపాళ్యం మండలం టేకుమంద గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు శ్రావణ్‌కుమార్‌కు పుంగనూరులోని గంగులయ్య కుమార్తె రోజాతో పదేళ్ల క్రితం వివాహమైంది. శ్రావణ్‌కుమార్ నిత్యం మద్యం తాగి భార్యతో గొడవ పడేవాడు. 2022 జూలై 18వ తేదీన రోజా కుటుంబీకులకు ఫోన్‌చేసి మీ కూతుర్ని తీసుకెళ్లిపోండని బెదిరించాడు. దాంతో వారు అదేరోజున టేకుమందకు చేరుకుని శ్రావణ్‌కుమార్‌ను ఏం జరిగిందని అడిగారు. ఈ సమయంలో తన తండ్రి సుబ్రహ్మణ్యంతోకలిసి భార్య కుటుంబీకులపై కత్తులతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. దీనిపై బాధితులు ఫిర్యాదు చేయగా పోలీసులు శ్రావణ్ కుమార్, సుబ్రహ్మణ్యంలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు గురువారం పీఎస్‌జే కోర్టులో వాయిదాకురాగా, నేరం రుజువైంది. దీంతో వారిద్దరికీ ఐదేళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎంవీఎస్ పద్మజ తీర్పుచెప్పారు. ఈ కేసును పీపీ శైలజ వాదించారు.

గృహహింస కేసులో ముగ్గురికి మూడేళ్ల జైలు

వడమాలపేట, ఫిబ్రవరి 6(ఆంధ్రజోతి): గృహహింస, అదనపు కట్న వేధింపుల కేసులో ముగ్గురికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించినట్లు వడమాలపేట ఎస్‌ఐ ధర్మారెడ్డి తెలిపారు. పత్తి పుత్తూరు పంచాయతీ అమ్మగుంట గ్రామానికి చెందిన శ్రీవాణి 2016లో తన భర్త మదనమోహన్ రెడ్డి, అత్త నాగమ్మ, ఆడబిడ్డ రాజ్యలక్ష్మి, మామ సుబ్బారెడ్డి అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, గృహ హింసకు పాల్పడుతున్నారని వడమాలపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు కాగా పుత్తూరు కోర్టులో విచారణ సాగింది. 2019లో మదనమోహన్ రెడ్డి మృతి చెందగా మిగిలిన ముద్దాయిలైన నాగమ్మ, రాజ్యలక్ష్మి, సుబ్బారెడ్డిలకు పుత్తూరు జేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ గోపాలకృష్ణ మూడు సంవత్సరాల జైలుశిక్ష, ఇద్దరు మహిళలకు రూ.8000 చొప్పన, సుబ్బారెడ్డికి రూ.9000 అపరాధ రుసుం విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. ఏపీపీ నిర్మల కేసు వాదించారు.

నీరు - చెట్టు బిల్లులకు మోక్షం

రూ.160 కోట్ల మంజూరుకు మంత్రివర్గ ఆమోదం

చిత్తూరు సిటీ/చిత్తూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న నీరు - చెట్టు బిల్లుల మంజూరుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.సీఎం చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన క్యాబినెట్ మీటింగ్‌లో పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.వీటిలో నీరు - చెట్టు బిల్లుల మంజూరు, ఇరిగేషన్ శాఖలో పనిచేస్తున్న 386 మంది ఇంజనీర్లపై చర్యల ఉపసంహరణ తదితరాలున్నాయి. ఇందులో మన జిల్లాకు సంబంధించి గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నీరు - చెట్టు బిల్లులు సుమారు రూ.160 కోట్లు మంజూరు కానున్నాయి.2015-19 మధ్యకాలంలో టీడీపీ ప్రభుత్వం జలసంరక్షణ, భూగర్భ జలాల అభివృద్ధి కోసం నీరు-చెట్టు పేరుతో కార్యక్రమాన్ని చేపట్టింది. చెక్ డ్యాముల మరమ్మతులు, కొత్తవాటి నిర్మాణం, చెరువుల అభివృద్ధి, జంగిల్ క్లియరెన్సు, కాలువల పునరుద్ధరణ వంటి జలసంరక్షణ పనులు ఈ కార్యక్రమం కింద జరిగాయి.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఈ కార్యక్రమం ద్వారా రూ.650.28 కోట్ల విలువైన 5,978 పనులు మంజూరయ్యాయి. వీటిలో రూ.366.26కోట్ల అంచనాతో 3,697 పనులు దశలవారీగా పూర్తయ్యాయి. వీటిలో 3068 చెక్‌డ్యాం పనులు, 304 సరఫరా కాలువల పనులు, 180 జంగిల్ క్లియరెన్సు పనులు, 2,430 చెరువుల అభివృద్ధి పనులను చేశారు.వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చాక అంతవరకు అమలైన అన్ని పథకాలనూ రద్దు చేసిన విషయం తెలిసిందే. నీరు-చెట్టుకు సంబంధించి కూడా రూ.120 కోట్ల విలువ చేసే 713 పనులను రద్దు చేసింది. పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులను కూడా విజిలెన్సు విచారణ పేరుతో ఆపేశారు.దీనిపై కోర్టుకు వెళ్లిన కొంతమంది కాంట్రాక్టర్లకు మాత్రం రూ.20 కోట్ల వరకు బిల్లులు చెల్లించారు. మిగిలిన వారంతా బిల్లులు మంజూరు కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో అల్లాడిపోయారు.ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిల్లుల్ని ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయడం మొదలెట్టింది. రూ.20 కోట్లను విడుదల చేసింది కూడా.ఈ నేపథ్యంలో రెండు వారాల క్రితం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నీరు- చెట్టు కార్యక్రమానికి సంబంధించిన మిగిలిన బిల్లుల్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయండంటూ ఆదేశాలు జారీ చేయడంతో కాంట్రాక్టర్ల ఆశలు చిగురించాయి.మంత్రి ఆదేశాలతో ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా పెండింగులో ఉన్న బిల్లుల్ని చిత్తూరులోని జలవనరుల శాఖ ఎస్‌ఈ కార్యాలయంలో అప్‌లోడ్ చేసే ప్రక్రియ ఊపందుకుంది. తాజాగా మంత్రివర్గ నిర్ణయంపై బిల్లులు రాక తీవ్రంగా నష్టపోయిన కాంట్రాక్టర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఇరిగేషన్ శాఖలో వివిధ పనులకు సంబంధించి సుమారు 30 మంది ఇంజనీర్లపై తీసుకున్న చర్యలను ఉపసంహరించుకోవడానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.



నేటినుంచి పీ-4 పాలసీపై ప్రజాభిప్రాయ సేకరణ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఉగాది నుంచి ప్రారంభించనున్న పీ-4 (ప్రజా ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం) పాలసీ అమలుపై శుక్రవారం నుంచి ఈనెల 22వ తేదీ వరకు ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం విజయవాడ నుంచి పీ-4 పాలసీపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. 15 రోజుల పాటు జరిపే ప్రజాభిప్రాయ సేకరణ సర్వేలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు, వివిధ రంగాల నిపుణులు, ప్రజాప్రతినిధుల సూచనలు తీసుకోవాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి స్వర్ణాంధ్ర విజన్ -2047 రూపొందించిన విధంగానే నియోజకవర్గ విజన్ - 2029 ప్లాన్‌ను క్షేత్రస్థాయిలో వివిధశాఖల సమన్వయంతో రూపొందించాలని చెప్పారు. నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు ప్రతి 15 రోజులకోసారి పాఠశాలలు, అంగన్వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి, లోటుపాట్లను గుర్తించి సరిదిద్దే చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో మోహన్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి 18వ ర్యాంకు



చిత్తూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డికి పనితీరుపరంగా 18వ ర్యాంకు లభించింది. గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు ఈ ర్యాంకులను ప్రకటించారు. గతేడాది జూలై నుంచీ డిసెంబరు దాకా ఆరు నెలల పాటు ఫైళ్ళ పరిష్కారంలో మంత్రుల పనితీరు ఆధారంగా ర్యాంకులు నిర్ణయించినట్టు ఆయన వెల్లడించారు.అందులో భాగంగా రవాణా, యువజనక్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డికి 18వ ర్యాంకు వచ్చింది. అయితే ఈ ఏడాది జనవరి నుంచీ ఫైళ్ళ పరిష్కారాన్ని పరిగణనలోకి తీసుకుంటే ర్యాంకుల్లో తేడాలుండే అవకాశముంది.కాకపోతే దాని కోసం ఈ ఏడాది జూన్ ముగిసే దాకా వేచి చూడాల్సి వుంది.

వ్యవసాయ కళాశాలకు బాంబు బెదిరింపు



వ్యవసాయ కళాశాలలో తనిఖీ చేస్తున్న బాంబు స్క్వాడ్ సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని వ్యవసాయ కళాశాలలో పేలుడు పదార్థాలు ఉంచామని, త్వరలో పేలుస్తామంటూ బెదిరింపు మెయిల్ వచ్చింది. 'స్వాతి బిలాల్ మాలిక్' పేరిట గురువారం వచ్చిన ఈ మెయిల్‌లో చిత్రకళ గోపాల్ ఘటన, సికిందర్ దర్గా ఘటన, సూసైడ్ హ్యూమన్ ఐఈడీల తయారీ తదితర అంశాలను ప్రస్తావించారు. అదనంగా ట్విన్ ప్లైప్స్ ఐఈడీ బ్లాస్ట్ బై హ్యూమన్ ఐఈడీ అనే పేలుడు సంభవించనున్నట్లు సంకేతాలిచ్చారు. దీనిపై ప్రిన్సిపాల్ రమణ తిరుపతి రూరల్ పోలీసులకు సమాచారమివ్వడంతో తనిఖీలు చేపట్టారు. పోలీసులు, డాగ్.. బాంబు డిస్పోజ్ స్క్వాడ్లు కళాశాలకు చేరుకుని ప్రిన్సిపాల్ చాంబర్, తరగతి గదులు, హాస్టళ్లు, పరిసరాల్లోనూ రెండు గంటలకుపైగా తనిఖీ చేశారు. ఏమీ దొరక్కపోవడంతో ఫేక్ మెయిల్‌గా భావిస్తున్నారు. ఈ మెయిల్ పంపింది ఎవరనే దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు చెప్పారు.

చిరుధాన్యాల ఉత్పత్తికే ప్రాధాన్యం

- పంటరుణాల పెంపునకూ టెక్నికల్ కమిటీ సిఫార్సు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల వినియోగం పట్ల ప్రజల్లో ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో వాటి ఉత్పత్తికి జిల్లా టెక్నికల్ కమిటీ ప్రాధాన్యత ఇచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చిరుధాన్యాల ఉత్పత్తికి, పంటరుణాల పెంపునకు సిఫార్సు చేసింది.కలెక్టరేట్‌లోని జేసీ విద్యాధరి ఛాంబర్‌లో వివిధ బ్యాంకర్లు, జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో జిల్లాస్థాయి టెక్నికల్ కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కొర్రలు, సామలు తదితర చిరుధాన్యాల పంటలకు ఎకరాకు రూ. 22వేలు బ్యాంకు రుణాలు ఇస్తుండగా, దీనిని వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రూ.25 వేలు ఇచ్చేవిధంగా కమిటీ సిఫార్సు చేసింది.ఎకరా మినుములు, పెసలు,ఉలవలు,రాగులు, సజ్జలు, జొన్నలు, ఇతర చిరుధాన్యాలకు రూ.22 వేలు ఇస్తుండగా దానిని రూ.25 వేలకు పెంచింది. హైబ్రిడ్ రకం వరికి ఇస్తున్న రూ.47వేలను రూ.51వేలకు పెంచుతూ ప్రతిపాదించారు.చెరకు (ప్లాంటేషన్)కు రూ.85 వేల నుంచి రూ.1.10లక్షలకు, నీటి ఆధారిత వేరుశనగ పంటకు రూ.35వేల నుంచి రూ.38వేలకు పెంచుతూ సిఫారసు చేసింది. మామిడి తోట నిర్వహణకు రూ.40 వేల నుంచి రూ.42,500కు, మల్బరీకి రూ.80 వేల నుంచి రూ.85 వేలకు పెంచాలని సిఫార్సు చేశారు. టమోటా స్థానిక రకానికి రూ.30 వేల నుంచి రూ.40 వేలకు, హైబ్రిడ్ రకానికి రూ.80 వేల నుంచి రూ.90 వేలకు, పెండాల్ రకానికి రూ.95వేల నుంచి రూ.లక్షకు పెంచుతూ ప్రతిపాదించారు. ఉల్లిపాయకు రూ.40వేల నుంచి రూ.48,500కు, ఉర్లగడ్డకు రూ.40వేల నుంచి రూ.54 వేలకు, మునక్కాయ పంటకు రూ.30 వేల నుంచి రూ.40వేలకు, వంకాయకు రూ.40వేల నుంచి రూ.50వేలకు సిఫార్సు చేశారు. ఎకరా మిరపపంటకు ప్రస్తుతం ఇస్తున్న రూ.75వేల రుణపరిమితిని రూ.లక్షకు పెంచింది. ఎకరా ఆకుకూరల పంటలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.20వేలను రూ.30వేలకు, ఎకరా ధనియాల పంటకు రూ.25వేల నుంచి రూ.30 వేలకు పెంచింది. కరివేపాకుకు రూ.35వేల రుణపరిమితిని రూ.56 వేలకు పెంచారు. పాడిపశువుల కొనుగోలుకు ప్రస్తుతం ఇస్తున్న రూ.30 వేలను రూ.40 వేలకు పెంచారు.కమిటీ చేసిన సిఫార్సులను రాష్ట్రస్థాయి కమిటీకి పంపి, ఆమోదం పొందిన తరువాత ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే పంట రుణాలను అన్ని బ్యాంకులు పంపిణీ చేస్తాయని డీసీసీబీ సీఈవో మనోహర్ గౌడ్ వివరించారు. ఈ సమావేశంలో ఎల్డీఎం హరీష్, నాబార్డు డీడీఎం సునీల్, వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, పశుసంవర్ధకశాఖ జేడీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



రూ.4.20 కోట్ల ఎర్రచందనం పట్టివేత

- ఎనిమిదిమంది తమిళ కూలీల అరెస్ట్

మంగళం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రెండు ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో రూ.4.20 కోట్ల విలువైన ఆరు టన్నుల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.మంగళవారం తెల్లవారుజామున అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం సానిపాయలోని కోమిటోనిచెరువు సమీపంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కూంబింగ్ చేపట్టారు. ఒక కారు, మోటార్ సైకిల్ ఆగి ఉండటం.. కొందరు ఎర్రచందనం దుంగలను కారులో లోడ్ చేసేందుకు వెళ్తుండటాన్ని గమనించారు. టాస్క్‌ఫోర్సు సిబ్బంది వారిని చుట్టుముట్టగా ఎనిమిదిమంది పట్టుబడ్డారు. మిగిలిన వారు పారిపోయారు. వారి నుంచి రెండు వాహనాలు, 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారు తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లాకు చెందిన కూలీలుగా గుర్తించారు. విచారణలో వారు చెప్పిన సమాచారం మేరకు కర్ణాటక రాష్ట్రం కటికనల్లి సమీపంలో దాచి ఉంచిన 185 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనంతో పాటు వాహనాలను తిరుపతి కపిలతీర్థం వద్ద గల టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అసభ్య ప్రవర్తనతో టీచర్ సస్పెన్షన్

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులపట్ల అసభ్యకరంగా వ్యవహరించిన టీచర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. విద్యాశాఖ అధికారుల కథనం మేరకు .. చిత్తూరులోని కట్టమంచి నగరపాలక ఉన్నత పాఠశాలలో సోషియల్ టీచర్‌గా పనిచేస్తున్న ధనశేఖర్ కొంత కాలంగా అసభ్యంగా ప్రవరిస్తుండడం భరించలేక టెన్త్ విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పాఠశాల హెచ్ఎంతో పాటు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటు విద్యాశాఖ నుంచి ఎంఈవో-2 మోహన్ కూడా విచారణ చేపట్టారు. పాఠశాలలో విద్యార్థినులతో పాటు పలువురిని విచారించగా ధనశేఖర్ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని తేలింది.డీఈవో వరలక్ష్మికి నివేదిక సమర్పించడంతో ఆమె ధనశేఖర్‌ను సస్పెండ్ చేశారు. దీంతో పాటు స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ జయరామయ్య తెలిపారు.



రాఘవేంద్రరావు - శ్రీనివాస్‌రెడ్డి - పులివర్తి నాని, జగన్మోహన్ - వసంత కృష్ణప్రసాద్

తిరుమలలో దర్శకేంద్రుడు

తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ప్రముఖ సినీ దర్శకుడు రాఘవేంద్రరావు, నటుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, జగన్మోహన్, పులివర్తి నాని, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

12న రామకృష్ణతీర్థ ముక్కోటి

తిరుమల, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 12న రామకృష్ణతీర్థ ముక్కోటి జరుగనుంది. తిరుమల కొండల్లో పవిత్రమైన సప్తతీర్థాలుగా స్వామి పుష్కరిణి, కుమారధార, తుంబురు కోన, శ్రీరామకృష్ణ తీర్థం, ఆకాశగంగ, పాపవినాశనం, పాండవతీర్థంలను భావిస్తారు. ఇందులో ఒకటైన రామకృష్ణ తీర్థం తిరుమలకు ఆరు మైళ్ల దూరంలో ఉంది. పుష్యమి నక్షత్రంతో కూడిన పౌర్ణమిరోజున ఈ తీర్థముక్కోటిని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఉదయం 7.30 గంటలకు శ్రీవారి ఆలయ అర్చకులు మంగళవాయిద్యాలతో ఆలయ మాడవీధుల గుండా పూలు, పండ్లు, స్వామి ప్రసాదాలతో శ్రీరామకృష్ణ తీర్థానికి వెళతారు. అక్కడున్న శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణుడి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పిస్తారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారు గనుక ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలని ఉన్నతాధికారులు సంబంధిత అధికారులను ఆదేశించారు.


శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లోని 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.2.97 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 58,600

తలనీలాలు సమర్పించినవారు: 19,083



అలుపన్నది ఉందా ఎగిరే అలకు..ఎదలోని లయకు అంటారు సిరివెన్నెల సీతారామశాస్త్రి ఓ సినీగీతంలో..రిటైరైనా... ఏడు పదులు దాటినా టెన్నిస్ రాకెట్ వదలని వీరిని చూస్తే ఆ పాటలోని మాటలు వీరికీ వర్తిస్తాయి. వీరి ఉత్సాహం చూసి వయసే వెనుకడుగేస్తుందేమో అనిపిస్తుంది. వృద్ధాప్యం దూరంగా జరిగిపోతోంది. నిరాశ పటాపంచలవుతోంది. జీవిత చరమాంకంలోనూ తరగని క్రీడోత్సాహం ప్రదర్శిస్తున్న ఈ విశ్రాంత ఉద్యోగుల తీరు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకమవుతుంది. విశ్రాంత జీవితమంటే కుర్చీలకు, మంచాలకు అంటిపెట్టుకుపోవడమని భావించేవారిని ఉత్సాహపరిస్తుంది. వయసుతో పనిలేకుండా ఆరోగ్యం కోసం ఇప్పటికీ ఆటలాడుతున్న వారిని చూస్తే ఔరా అనిపిస్తుంది. తిరుపతిలోని ఆఫీసర్స్ క్లబ్,టౌన్‌క్లబ్‌ల్లో ఇలా టెన్నిస్ ఆడుతున్న కొందరు రిటైర్డ్ ఉద్యోగులను ఒకసారి పలుకరిద్దాం..

- తిరుపతి,క్రీడలు (ఆంధ్రజ్యోతి)

మలిసంధ్యలో మళ్లీ ఆడేద్దాం

- ఏడు పదులు పైబడినా తరగని క్రీడోత్సాహం
- విశ్రాంత జీవితంలో ఉల్లాసంగా..





లాన్‌టెన్నిస్ టోర్నీలో పాల్గొన్న వృద్ధ క్రీడాకారులు

రోగాలు దరిచేరవు....



నేను ఆంధ్రాబ్యాంకులో పనిచేసేవాడిని. మేనేజరు హోదాలో రిటైరయ్యాను. నాకు 76సంవత్సరాలు. చదువుకునే రోజుల నుంచి ఆటల్లో పాల్గొనేవాడిని. రిటైరయ్యాక పడక కుర్చీకి పరిమితం కావడం ఇష్టం లేదు. అందుకు ఆటను వదలలేదు. 60ఏళ్ల టెన్నీస్ ఆడుతున్నా, 40టోర్నమెంట్స్‌లో పాల్గొన్నాను. 18నేషనల్స్ టోర్నీలకు ప్రాతినిథ్యం వహించాను. బహుమతులు సొంతం చేసుకున్నా. రోజు ఏదో ఆటలాడితే అనారోగ్యం దరిచేరదు. మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. అందరూ తీరిక సమయంలో క్రీడల్లో పాల్గొంటే చాలా మంచిది.

- ఎన్.సి.అశోకొరెడ్డి తిరుపతి

ఒక్క రోజు మిస్సైతే ఏదో కోల్పోయినట్టుంది...



ఎస్వీ యూనివర్సిటీలో ప్రొఫెసరుగా పనిచేసి రిటైరయ్యాను. నా వయసు 73ఏళ్లు. గడచిన 45 సంవత్సరాలుగా ఉదయం, సాయంత్రం స్నేహితులతో కలసి కనీసం రెండు గంటలపాటు టెన్నీస్ ఆడుతాను. రోజూ ఆడటం వల్లే యాక్టీవ్‌గా, ఫిట్‌గా ఉన్నానని నమ్ముతున్నా. షుగర్, బీపీలాంటివేవీ లేదు. ఎప్పుడైనా చిన్నపాటి దెబ్బలు తగలినా టెన్నీస్ వదల్లేదు. ఈ తరం పిల్లల్లో క్రీడలపై ఆసక్తి పెరగాలి. తల్లిదండ్రులు,స్కూలులో ఇందుకు ప్రోత్సహించాలి.

- హనుమంతరావు, తిరుపతి

రిటైర్మెంటు వయసుకు మాత్రమే..



ప్రొఫెసరుగా రిటైరయ్యాను. ఇప్పుడు 78ఏళ్లు. ఎప్పుడూ ఆధారపడే మనస్తత్వం ఉండకూడదనుకుంటాను. మనసులో ఉత్సాహం ఉంటే లైఫ్ బాగుంటుంది. ఇందుకు క్రీడలు బాగా సహకరిస్తాయి. నా విషయంలోనే ఇదే కరెక్టయింది. రోజూ గంటపాటు టెన్నీస్ ఆడుతా. వాస్తవానికి నేను ఆహారం విషయంలో పెద్దగా నియమాలను పాటించను. చలాకీగా ఉంటాను. రిటైర్మెంటు వయసుకే గాని మనసుకు కాదని నమ్ముతాను. ఇప్పటివరకూ ఎలాంటి అనారోగ్య సమస్య ఎదురుకాలేదు. నేటి యువత కూడా క్రీడలపట్ల శ్రద్ధ చూపాలి. చదువు, ఆటల వల్ల క్రమశిక్షణ అలవాటవుతుంది.

- సి.రఘునాథరెడ్డి, నర్సింగాపురం

ఆటలతో ఆయుష్షు పెరుగుతుంది.

బీఎస్‌ఎన్‌ఎల్‌లో పనిచేసి రిటైరయ్యాను. గత 30ఏళ్లుగా టెన్నీస్ ఆడుతున్నా. ఎన్నో టోర్నీలో పాల్గొని రాణించాపే. ఆటల వల్ల ఆయుష్షు పెరుగుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆటలవైపు ప్రోత్సాహించాలి. మానసిక వికాసం, దేహ దారుఢ్యం లభిస్తుంది. ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనే ధైర్యం అలవడువుతుంది. మనసు ధృడంగా ఉంటుంది. పోటీతత్వం పెరిగితే అన్ని రంగాల్లోనూ ముందంజ వేయవచ్చు.

- యు.ఆనందకేశవులు, తిరుపతి



గోదాములో రేషన్‌బియ్యం



ఏడు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి శివారులోని ఈదులగుంటలో అక్రమంగా ఉంచిన ఏడు టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల ఫిర్యాదుతో స్పెషల్‌బ్రాంచ్ పోలీసులు గురువారం రెక్కీ నిర్వహించారు. వీరి సమాచారంతో శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, టూటౌన్ పోలీసులను అప్రమత్తం చేశారు. వాళ్లు అక్కడికి చేరుకుని ఆటో సహా గోదాములోని రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించి ఏడు టన్నుల బియ్యం ఉన్నట్లు తెలిపారు. సివిల్‌సప్లయిస్ గోదాముకు తరలించారు. రేషన్‌బియ్యం అక్రమార్కుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన పోకూరు గంగాధరం అనే యువకుడు రేషన్‌బియ్యం స్మగ్లింగ్ చేస్తూ పలుమార్లు పట్టుబడ్డాడు. కేసులూ ఉన్నాయి. ఈ రేషన్ బియ్యం కూడా అతడిగా అధికారులు నిర్ధారించినట్లు సమాచారం. ఇతడితో పాటు శ్రీకాళహస్తి మండలం తొండమనాడుకు చెందిన ఓ యువకుడు, వీరికి ముఠా నాయకుడిగా తిరుపతికి చెందిన ఓ మద్యం వ్యాపారి ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. పూర్తిగా విచారించి రేషన్‌బియ్యం స్మగ్లింగ్ వెనుక ఉన్న వారి వివరాలను వెల్లడిస్తామని టూటౌన్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.



గోదాము వద్ద రేషన్‌బియ్యం తరలిస్తున్న ఆటో

రాత్రి గస్తీ పటిష్ఠ పరుస్తాం

పాత నేరస్తుల కదలికలపై నిఘా

ఎస్పీ హర్షవర్ధనరాజు వెల్లడి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరుస దొంగతనాలు అరికట్టడానికి రాత్రి గస్తీలు, డైనమిక్ బీట్లపై పునఃసమీక్షించి పటిష్ఠపరుస్తామని ఎస్పీ హర్షవర్ధన రాజు తెలిపారు. 'యూపీ ముఠా పనేనా?' అంటూ వరుస దొంగతనాలకు సంబంధించి ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఐదేళ్లలో జరిగిన దొంగతనాలు, దోపిడీలు, ఇతర ఘటనలను సమీక్షించి, ఎక్కడెక్కడ ఎక్కువగా.. ఏ సమయాల్లో.. ఎలాంటి దొంగతనాలు జరిగాయి? ఎవరి పాత్ర ఉందేది అధికారులతో సమీక్షిస్తామన్నారు. అక్కడ గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సిబ్బంది కొరత, వారం రోజులుగా వివిధ బందోబస్తు విధుల్లో ఉన్నందున బీట్లపై కొంత నిఘా తగ్గిందని అన్నారు. జిల్లాలోని పాత నేరస్థులు, అనుమానితుల వేలి ముద్రలు, ఫొటోలు సేకరించే పని వేగవంతం చేశామన్నారు. రెండు రోజుల వ్యవధిలో దాదాపు 80 మంది నేరస్థుల వేలి ముద్రలు సేకరించినట్లు ఆయన చెప్పారు. శివారు ప్రాంతాలు, ఏకాంత కాలనీలు, అక్కడక్కడ రోడ్ల పక్కన గుడిసెలు వేసుకుని ఉంటున్న వారిపైనా నిఘా పెంచుతామన్నారు. తిరుపతిలో సీసీ కెమెరాల వ్యవస్థను పరిశీలించి అవసరమైన చోట్ల కొత్తవి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎక్కడైనా పాత నేరస్తులు, అనుమానితులు తిరుగుతుంటే సమీప స్టేషన్లకు, లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

10న ముగియనున్న కుంభమేళా బుకింగ్

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళా ప్రత్యేక టూర్ ప్యాకేజీ టికెట్ బుకింగ్‌కు ఈ నెల 10వ తేదీతో గడువు ముగియనుందని డివిజనల్ మేనేజర్ సీహెచ్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 11న ఉదయం 5 గంటలకు శ్రీనివాసం నుంచి బయల్దేరనున్న ఏసీ బస్సులో 45సీట్లకుగాను 24 రిజర్వేషన్ అయ్యాయని, 21మిగిలి ఉన్నాయని తెలిపారు. పోను, రాను ఛార్జీలు పెద్దలకు రూ. 22వేలు, పిల్లలకు(3నుంచి 10సంవత్సరాల లోపు వయస్సు) రూ.19వేలుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. మార్గంమధ్యలో ఒంటిమిట్ట, బాసర, జబల్పూర్, చిత్రకూట్, ప్రయాగరాజ్, వారణాసి, నాగపూర్, ధర్మపురి, మహానంది తదితర ప్రాంతాలను చూపుతారని తెలిపారు. ఆసక్తిగలవారు మరిన్ని వివరాలకు 9848850099, 9848973985, 9848802099, 08772289123, 9848007033లను సంప్రదించాలని కోరారు.

పేదరిక నిర్మూలనకు పీ4 పాలసీని అమలు చేయండి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల్లో పేదరిక నిర్మూలనకు పీ4(పబ్లిక్, పీపుల్, ప్రైవేట్, పార్టనర్‌షిప్) అమలుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి సీఎస్ పీ4పాలసీతో పాటు పలు అంశాలపై సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరయ్యారు. సీఎస్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్-2047లో పది సూత్రాల అమలుకు, రాష్ట్రంలో వృద్ధిరేటు సాధనకు, పేదరిక నిర్మూలనకు ప్రణాళికల తయారు చేసి, అమలు చేయాలన్నారు. అందుకోసం శుక్రవారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, డీపీవో సుశీలాదేవి పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఇద్దరు ఉపాధ్యాయులను విధుల నుంచి తొలగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ గురువారం వెల్లడించారు. ఎరికంబట్టు హరిజనవాడలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ టి.వెంకటరమణ, తొట్టంబేడు మండలం ఎగువ సాంబయ్యపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు స్కూల్ అసిస్టెంట్ టి.కృష్ణయ్య పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్టు ఇటీవల ఫిర్యాదులు అందాయని వెల్లడించారు. విచారణ జరిపించామని, నివేదికల ఆధారంగా క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు డీఈవో వెల్లడించారు.

బీసీ రుణాల దరఖాస్తుకు గడువు పెంపు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తుకు ఈనెల 12వ తేదీ వరకు గడువు పెంచినట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారుల నుంచి వస్తున్న వినతులను దృష్టిలో పెట్టుకుని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సహా వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్న యూనిట్లకు దరఖాస్తుల గడవును పెంచడం జరిగిందని, అర్హులైన నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వైద్యశాఖలో ఉద్యోగాలకు నోటిఫికేషన్

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాల, రుయా స్పత్రి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, శ్రీపద్మావతీ నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ స్కూల్ ఆఫ్ నర్సింగ్‌కు సంబంధించి పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 22 తేదీ సాయంత్రం 5 గంటల్లోపు పూర్తి చేసిన దరఖాస్తులను ఎస్వీ వైద్య కళాశాలలో అందజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులు, పూర్తి వివరాల కోసం కళాశాల వెబ్‌సైట్‌ను, ఉమ్మడి జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.



ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయురాలు

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఉపాధ్యాయురాలి మృతి

రేణిగుంట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ఉపాధ్యాయురాలు మృతి చెందిన సంఘటన గురువారం మర్రిగుంట వద్ద చోటుచేసుకుంది. గాజులమండ్యం పోలీసుల కథనం మేరకు గౌరీనగర్‌కు చెందిన కరీమునిసా బేగం పాపానాయుడుపేట జడ్పీ హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం తన ద్విచక్ర వాహనంపై పాపానాయుడుపేటకు వెళుతుండగా మర్రిగుంట మలుపు వద్ద రోడ్డు దాటే క్రమంలో తిరుపతి నుంచి మునిలిపేడుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఉపాధ్యాయురాలి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గురుదక్షిణామూర్తికి బంగారు రుద్రాక్షహారం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మేధో గురుదక్షిణామూర్తికి గురువారం శ్రీచైతన్య విద్యాసంస్థల ఛైర్‌పర్సన్ డాక్టర్ బొప్పల ఝాన్సీ లక్ష్మీబాయి రూ.8లక్షల విలువైన 32 పంచముఖ రుద్రాక్షల బంగారు హారాన్ని వితరణ చేశారు. దీనిని ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిదిలో స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాయుడుపేటలో రామాంతపూర్ ఎక్స్‌ప్రెస్ నిలుపుదల

నాయుడుపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నుంచి రామాంతపూర్‌కు వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్ తొలిసారిగా నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్‌కు గురువారం ఆమోదం పొందింది. తొలిసారిగా నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో ఉదయం 8.18 నిమిషాలకు స్టాపింగ్ కావడంతో డీఆర్‌యుసీసీ సభ్యుడు పేర్నాటి జోసెఫ్, రైల్వే బోర్డు మెంబరు చిగురాకుల సురేంద్ర, నాయుడుపేట సదరన్ రైల్వే వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.మస్తాన్, ఉపాధ్యక్షుడు రాఘవన్, కె. కిరణ్, స్టేషన్ మాస్టర్ చిరంజీవి తదితరులు రైల్వే డ్రైవర్లను సత్కరించారు. రామాంతపూర్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తూ నాయుడుపేటలో ప్రతి శనివారం రాత్రి 12.13 నిమిషాలకు నిలుపుదల ఉంటుందని వారు తెలియజేశారు.



అభినందనలు తెలియజేస్తున్న డీఆర్‌యుసీసీ సభ్యులు జోసెఫ్, మస్తానయ్య, రవి, తదితరులు

రైతులకు 9 గంటల విద్యుత్ సరఫరా

- ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలో వ్యవసాయ రంగానికి 9 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని సంస్థ సీఎండీ కె.సంతోష్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీమలో సాగుకు ఏడు గంటలే కరెంట్ అనే శీర్షికపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఆయన స్పందించారు. సంస్థ పరిధిలో ఉన్న తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో రైతుల అవసరాల మేరకు 9 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని వివరించారు. చీఫ్ జనరల్ మేనేజరు(ఆపరేషన్) జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చే క్రమంలో సమయ గణాంకాల్లో పొరపాటు దొర్లిందని పేర్కొన్నారు.

జగనన్న కాలనీల్లో నకిలీ పట్టాల బాగోతం

- పూర్వ డీటీతోపాటు మరో ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు

రేణిగుంట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో నకిలీ పట్టాల బాగోతం వెలుగు చూస్తోంది. బాధితుల ఫిర్యాదు మేరకు పూర్వ డిప్యూటీ తహసీల్దారుతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. 2022లో తిరుపతి జీవకోనకు చెందిన బుజ్జమ్మ, చెంచయ్య, అహ్మద్, మల్లిషావలి అనే వారికి రేణిగుంట మండలం కుర్రకాల్వ, అడుసుపాళెం, తారకరామనగర్‌లో జగనన్న ఇంటి పట్టాలు ఇప్పిస్తానని రేణిగుంటలోని కొంతమంది దళారులను కలిసి అప్పటి ఓ అధికారి ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆరోపణలున్నాయి. వారి నుంచి ఒక్కో ఇంటి పట్టాకు రూ.1.8 లక్షల చొప్పున రూ.7.20 లక్షలను రెండు విడతలుగా తీసుకున్నట్లు విమర్శలున్నాయి. ఈ రేణిగుంట తహసీల్దారు కార్యాలయంలోని రికార్డు రూములో భద్రపరచిన ఖాళీ జగనన్న పట్టాలకు రెవెన్యూ సిబ్బంది చేత కొనుగోలుదారుల పేరు రాయించి ఇచ్చినట్లు తెలిసింది. ఇలా పట్టాలు ఇచ్చేసినట్లు వారికి చెప్పారు. ఆ సమయంలో వారికి స్థలాలు చూపలేదు. ఆ తర్వాత కొనుగోలుదారులు కంప్యూటర్ ఆపరేటర్ శశికళ, నకిలీ వీఆర్వో తనిష్కా, సుబ్రమణ్యం అనే దళారిని పలుమార్లు కలిసి నిలదీసినా ఫలితం లేకుండా పోయింది. చివరకు వారు తహసీల్దారు కార్యాలయంలో విచారించగా ఆ పట్టాలు బోగస్‌గా తేలడంతో మోసపోయామని గుర్తించారు. దీనిపై రేణిగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి డిప్యూటీ తహసీల్దారు ప్రేమ్‌కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ శశికళ, నకిలీ వీఆర్వో తనిష్కా, దళారి సుబ్రమణ్యంపై ఐపీసీ 468, 471, 420 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీనిపై తహసీల్దారు విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక అందజేయాల్సి ఉంది.

గ్రావెల్ టిప్పర్ సీజ్ : యజమానిపై కేసు నమోదు



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్‌ను తొట్టంబేడు పోలీసులు సీజ్ చేశారు. తొట్టంబేడు ఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపిన ప్రకారం.. శివనాథపాళెం పరిసరాల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఈశ్వరయ్య సిబ్బందితో శివనాథపాళెంలో గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం రాత్రి స్టేషన్‌కు తరలించారు. టిప్పర్ యజమాని రమేష్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం తహసీల్దారు మధుసూదన్‌రావుకు వాహనాన్ని అప్పగించిన్నట్లు తెలిపారు. తాము వెళ్లేలోగా ఘటనా స్థలంనుంచి ఎక్స్‌కవేటర్ వెళ్లిపోయినట్లు ఎస్‌ఐ చెప్పారు. అక్రమంగా గ్రావెల్, ఇసుక తరలించే వాహనాలను గతంలో న్యాయస్థానానికి అప్పగించేవారు. ఇటీవల కొంతకాలంగా రెవెన్యూ అధికారులకు అప్పగిస్తుంటంతో అక్రమార్కులు మళ్లీ మళ్లీ తవ్వకాలకు తెగబడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మాలధారణకు తయారుచేసిన వస్త్రాలు



దేవుడి అలంకరణ వస్త్రాలు



విగ్రహాలకు చుట్టే వస్త్రాలు



కొత్తపేటలో వస్త్రాల తయారీ

నగరి వస్త్రాలకు ఆధ్యాత్మిక సౌరభాలు!

కాటన్ చొక్కాల నుంచి ఉత్సవాల వస్త్రాల దాకా నేతన్న ప్రస్థానం

నగరి, ఆంధ్రజ్యోతి

ఒకప్పుడు అంటే 50యేళ్ల క్రితం నూలు వస్త్రాల తయారీకి నగరి ప్రసిద్ధి. నగరి కాటన్ చొక్కాలు,ప్యాంట్లు,చీరలకు మన దేశంలోనే కాదు విదేశాల్లోనూ ఎంతో డిమాండు వుండేది.దేశంలో గుజరాత్ తర్వాత మరమగ్గాలు వాడిన ప్రాంతంగా 1976లోనే నగరి నేతపరిశ్రమ పేరుగాంచింది. కొత్తపేట,ఏకాంబరకుప్పం ప్రాంతాల్లో తయారయ్యే కాటన్ చొక్కాలు, కాటన్ చీరలకు విదేశాల్లో కూడా డిమాండు వుండేది.అమెరికా,జపాన్ దేశాలతో పాటు యూరప్ దేశాల నుంచి కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు నగరికి వచ్చి నూలు వస్త్రాలకు ఆర్డర్లు ఇచ్చేవారు. నగరి, పుత్తూరు, నారాయణవనంలో వున్న ఉత్పత్తిదారులు విదేశీ కంపెనీలతో సత్సంబంధాలు కలిగి ఉండేవారు.మాంగాడు పట్టుచీరలకు, నూలు చీరలకు ప్రసిద్ధి గాంచింది. షర్టు బిట్ల తయారీలో పేరు గాంచిన నగరి నేతగాళ్లు 1990 తర్వాత నూలు రేట్లు పెరగడం, ఎగుమతులపై ఆంక్షల కారణంగా విదేశీ ఆర్డర్లు తగ్గిపోవడంతో చుడీదార్ల తయారీపై మొగ్గు చూపారు.ప్రస్తుతం చుడీదార్లతోపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సంబంధించిన వస్త్రాల తయారీలో ముందడుగు వేస్తున్నారు.

వస్త్రాల తయారీలో పవిత్రతకు ప్రాధాన్యం

వివిధ ఆలయాల్లో కుంభాభిషేక కార్యక్రమాలకు ఉపయోగించే దుస్తులన్నీ ప్రస్తుతం నగరిలోని చింతలపట్టెడ,కొత్తపేట, ఏకాంబరకుప్పం, కేవీపీఆర్ పేట,సత్రవాడ ప్రాంతాల్లో మొదలియార్ల చేతులమీదుగా తయారవుతున్నాయి. ప్రధాన ఆచార్య వస్త్రాలు, సాదిక వస్త్రాలు, వాస్తు వస్త్రాలు, పరివట్టం, కుంభాభిషేకం చీరలు, రవికలు, వినాయక విగ్రహాలకు కట్టే పంచెలు, కలశాలపై ఉంచే దుస్తులను అవసరమైన వారు ఇక్కడ కొనుగోలు చేస్తున్నారు.అలాగే అయ్యప్ప దీక్షకు వాడే నలుపు, నీలం, కాషాయ రంగు వస్త్రాలు, గోవిందమాలకు వాడే పసుపు, సుబ్రమణ్య స్వామి దీక్షకు వాడే పచ్చరంగు వస్త్రాలు, ఓంశక్తి, ఆదిపరాశక్తి అమ్మవారికి వాడే ఎరుపు రంగు వస్త్రాలను కూడా ఇక్కడ తయారుచేస్తున్నారు.వస్త్రం కొలతను అనుసరించి రోజుకు 15 నుంచి 20 వస్త్రాలు ఒక మగ్గంలో తయారవుతాయి.ఈ వస్త్రాలు తయారుచేసే సమయంలో పవిత్రతకు ప్రాధాన్యం ఇస్తారు.స్నానం చేయకుండా పనిలోకి దిగరు. మద్యం, మాంసాహారం జోలికెళ్లరు.బంధువులెవరైనా మరణించి అంటు వున్న సమయంలో వస్త్రాలు నేయడం మానేస్తారు.



కుంభాభిషేకానికి వాడే వస్త్రాలు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు దుస్తుల సరఫరా

నగరి ప్రాంతంలో నేసే ఆధ్యాత్మికపరమైన కార్యక్రమాల్లో ఉపయోగించే వస్త్రాలకు మన రాష్ట్రంతో బాటు తమిళనాడులోనూ మంచి గిరాకీ వుంది.తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన కుంభకోణం, తంజావూరు, మదురై, పళని, చిదంబరం, తిరువణ్ణామలై, కాంచీపురం, తిరుచ్చి, కన్నియాకుమారి, తిరుచందూర్, నాగర్‌కోవిల్ తదితర ఆలయాల్లో జరిగే వేడుకలకు ఇక్కడినుంచే వస్త్రాలు తీసుకెళతారు. వ్యాపార కేంద్రాలైన చెన్నై, ఈరోడ్డు ప్రాంతాలకు చెందినవారు ఇక్కడినుంచే ఆధ్యాత్మిక వస్త్రాలను కొనుగోలు చేస్తుంటారు.

సిట్ వేస్తే.. తాడేపల్లి ప్యాలెస్ బయట డాక్యుమెంట్లు తగులబడ్డాయి! : టీడీపీ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్‌పై ఉదయం సిట్ వేస్తే.. రాత్రికి తాడేపల్లి ప్యాలెస్ బయట డాక్యుమెంట్లు తగులబడ్డాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సిట్ ఇంటిదాకా వస్తుందని మాజీ సీఎం జగన్ ముందే రాసుకున్న లెక్కలు, డాక్యుమెంట్లు తగుల బెట్టారా.. బుధవారం సాయంత్రం డాక్యుమెంట్లు, ఫైళ్లు తగులబడితే ఇంటి ముందున్న సీసీ ఫుటేజీ ఎందుకు బయట పెట్టలేదు.. తానే తగులబెట్టి, ప్రభుత్వం మీద తోసేయడమేనా 2.0 అంటే.. అని ప్రశ్నించారు. ఎన్ని కుట్రలు చేసినా వదిలేది లేదని.. సిట్ వస్తుందని.. విచారణ చేసి అన్ని స్కామ్‌లు బయటకు తీస్తుందని పేర్కొన్నారు.

టీచర్ల వర్క్‌షాప్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోండి

వెదురుకుప్పం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో ఈనెల చివరి వారంలో జరగనున్న యాక్షన్ రీసెర్చ్‌పై ఆసక్తి ఉన్న టీచర్లకు వర్క్‌షాపు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ శేఖర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యాయులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న 50 మందికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టండి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలు నుంచి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, డీఈఈ, ఏఈఈ, ఈవోపీఆర్డీలతో సమీక్షించారు. ప్రతి మండలంలో ప్రస్తుతం ఉన్న నీటి వనరులను గుర్తించి, వాటి స్థితిగతులపై ఈనెల 1 నుంచి మార్చి 15వ తేదీవరకు 45 రోజులపాటు బోర్‌వెల్స్, చేతిపంపుల నిర్వహణపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక రూపంలో అందజేయాలని చెప్పారు. గతంలో టైఅప్ ద్వారా నీటి సరఫరా చేస్తున్న గ్రామాల వివరాలను సేకరించాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా రక్షిత మంచినీటి ట్యాంకులను ప్రతినెలకోసారి శుభ్రం చేయాలని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ప్రాంతాలు, వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉన్న సమాచారం సేకరించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిరుపతిని భ్రష్టుపట్టించింది మీరే

● కరుణ, అభినయ్‌లకు కార్పొరేటర్ దొడ్డారెడ్డి లేఖ

తిరుపతి, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా జరిగిన నాటకీయ పరిణామాల నేపథ్యంలో నలుగురు కార్పొరేటర్లపై వైసీపీ బహిష్కరణ వేటువేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా దొడ్డారెడ్డి కుటుంబంపైనే భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడు ఫోకస్ చేయడం చర్చకు దారితీసింది. దీనికి ప్రతిస్పందనగా వైసీపీ హయాంలో భూమనకు ఆత్మగా వ్యవహరించిన దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి తనయుడు 10వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రతాప్‌రెడ్డి గురువారం సోషల్ మీడియాలో విడుదల చేసిన ఓ లేఖ రాజకీయంగా చర్చగా మారింది. 'దివంగత వైఎస్ రాజారెడ్డితో మొదలైన మా రాజకీయ ప్రస్థానం వైఎస్ఆర్‌తో కలిసి నడిచేలా చేసింది. జగనన్న కష్టకాలంలోనూ పార్టీ వీడకుండా ఎన్ని అవమానాలు ఎదురైనా అంకితభావంతో పనిచేశాం. దానికి బహుమానంగా మాపై సస్పెన్షన్ వేస్తారా? మీ మొండి వైఖరితో పార్టీకోసం కష్టపడినవారిని విస్మరించినందుకే రాయలసీమలో ఏ అభ్యర్థి పొందని ఘోరమైన ఓటమిని తిరుపతిలో మూటకట్టుకున్నారు. వైసీపీ ఆవిర్భావం నుంచి కష్టపడ్డ ఒక్క కార్యకర్తకైనా అధికారంలోకి వచ్చాక లబ్ధి చేకూర్చారా? వైఎస్ కుటుంబ కోసం పనిచేశామే గానీ మీలాంటి చరిత్రహీనులకోసం కాదు. తిరుపతిలో పార్టీలకతీతంగా సోదరభావంతో మెలిగే వాతావరణాన్ని మీరే తుడిచివేశారు. మీ నీచమైన రాజకీయాలకోసం, విద్వేష భేషజాలకు ఆజ్యంపోసి ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని భ్రష్టుపట్టించింది మీ తండ్రీ కొడుకులే కదా!' అంటూ పోస్టు చేసిన లేఖ వైరల్‌గా మారింది.

టీటీడీలో సీనియర్ పోటు వర్కర్లకు స్థాయి పెంపు

● రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

తిరుపతి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నం, కోట మండలం కొత్తపట్నం గ్రామాల పరిధిలో చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (సీబీసీఐ)కు భూములు కోల్పోతున్న రైతులకు రూ.78,84,83,200 పరిహారం చెల్లించడానికి కలెక్టర్ వెంకటేశ్వర్ పంపిన ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించింది. ఈ అంశాన్ని ప్రత్యేక కేసుగా పరిగణిస్తూ 2012 సెప్టెంబరు 14న జారీ చేసిన జీవో ఎంఎస్ నంబరు 571ను సడలించి మరీ ఈ ఒక్కసారికి ఈ మొత్తాన్ని పరిహారంగా చెల్లించేందుకు అంగీకరించింది. టీటీడీలో 15 సీనియర్ పోటు వర్కర్ పోస్టులను సూపర్‌వైజర్ పోస్టులుగా స్థాయి పెంచాలని టీటీడీ చేసిన అభ్యర్థనపై మంత్రివర్గం సానుకూలంగా స్పందించింది. ఆ మేరకు 15 సీనియర్ పోటు వర్కర్ పోస్టులను రూ. 40,970 - రూ.1,24,380 జీతశ్రేణితో సీనియర్ అసిస్టెంట్ హోదాతో సమాన హోదా కల్పిస్తూ సూపర్‌వైజర్ పోస్టులుగా స్థాయి పెంచేందుకు అంగీకరించింది. అమరావతిలో గురువారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో జిల్లాకు సంబంధించి ఈ రెండు సానుకూల నిర్ణయాలు తీసుకున్నారు.

మనమంతా ప్రజాసేవకులం

అధికారులు, సిబ్బందితో కలెక్టర్



కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మనమంతా ప్రజాసేవకులం అన్న విషయాన్ని మర్చిపోవద్దని అధికారులు, సిబ్బందితో కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని జ్యోతిరావు పూలే భవన్, వివేకానంద భవన్, అంబేడ్కర్ భవన్‌లోని పలు విభాగాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమయపాలన పాటిస్తూ.. ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలను ఆహ్లాదకరంగా ఉంచేలా పెయింటింగ్ చేయించడం జరిగిందని చెప్పారు. కార్యాలయాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపైనా ఉందన్నారు. ప్రతి సెక్షన్‌లోనూ ఫైళ్లను సక్రమమైన రీతిలో ఉంచుకోవడంతోపాటు భద్రపరచుకోవాలని ఆదేశించారు. త్వరలో సచివాలయ ఆవరణంలో ప్రభుత్వ వాహనాల పార్కింగ్ షెడ్‌ను నిర్మించేలా చర్యలు చేపట్టాలని ఏవో కులశేఖర్‌కు ఆదేశాలిచ్చారు.

ప్రతి అర్జీని గడువులోగా పరిష్కరించాలి

రెవెన్యూ సదస్సుల్లో అందిన ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలు, సర్వే ఏడీ, మండల సర్వేయర్లు, సంబంధిత ఇతర శాఖల అధికారులతో సమీక్షించారు. అర్జీదారులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని చెప్పారు. జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి న్యాయం చేయండి

పన్నూరు సబ్‌స్టేషన్‌లో అగరం దళితవాడవాసుల ధర్నా



ధర్నా చేస్తున్న అగరం దళితవాడ వాసులు

విజయపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రవి, మంజుల కుటుంబాలకు న్యాయం చేయాలని విజయపురం మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌లో గురువారం నింద్ర మండలం అగరం దళితవాడవాసులు ధర్నా నిర్వహించారు. బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళుతున్నవారు గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందితే ఇంతవరకు నిందితులను గుర్తించకపోవడం సరికాదన్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోస్టుమార్టం చేసిన మృతదేహాలను తీసుకోమని భీష్మించుకున్నారు. ఉదయం 11నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ధర్నా కొనసాగించారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీఐ భాస్కర్, ఎస్ఐ బలరాంలు బాధితులతో మాట్లాడారు. సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించామని నిందితులను పట్టుకుంటామని సర్దిచెప్పడంతో ధర్నా విరమించారు.

ఉన్నత విద్యనభ్యసించండి

అప్పుడే రాజ్యాధికారంవైపు అడుగులేయవచ్చు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సూచన



సెమినార్‌లో ఎంపీ ప్రసాదరావుతో బీసీ సంఘాల నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెనుకబడిన వర్గాలవారు ఉన్నత విద్యనభ్యసించాలని, అప్పుడే రాజ్యాధికారంవైపు అడుగులేసేందుకు అవకాశం ఉంటుందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సూచించారు. గురువారం ఢిల్లీలోని ఆంధ్ర భవన్‌లో జరిగిన నేషనల్ బీసీ సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. తమ హక్కులు, ప్రయోజనాల సాధనకోసం అన్ని సామాజిక వర్గాలు పోరాటం చేయడంలో తప్పులేదన్నారు. పార్లమెంటులో బీసీలకు ప్రాధాన్యం కల్పించాలని చేస్తున్న పోరాటాన్ని కేంద్ర ప్రభుత్వం తప్పక గుర్తిస్తుందని చెప్పారు. బీసీలకు సముచిత స్థానం కల్పిస్తుందని ఆశిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోనూ కూటమి ప్రభుత్వంలో సీఎం నారా చంద్రబాబు నేతృత్వంలో బీసీలకు సముచిత స్థానం కల్పించడమే కాకుండా, వారికి అండగా నిలుస్తుందని ఎంపీ తెలిపారు.

వెటర్నరీ విద్యార్థుల ర్యాలీ.. మానవహారం

నాల్గవ రోజుకు చేరిన సమ్మె



తిరుపతి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా ఉపకారవేతనం(స్టైఫండ్) పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె నాల్గవరోజు గురువారమూ కొనసాగింది. ఉదయం వర్సిటీ ప్రధాన గేటు నుంచి బాలాజీకాలనీ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. బాలాజీకాలనీ సర్కిల్‌కి చేరుకుని మానవహారం చేపట్టారు. విద్యార్థులు మాట్లాడుతూ వైద్యవిద్య కోర్సులు చదివే విద్యార్థులకు నెలకు రూ.20వేలకుపైగా స్టైఫండ్ అందిస్తూ వెటర్నరీ యూజీకి రూ.7వేలు, పీజీకి రూ.9వేలు, పీహెచ్‌డీ విద్యార్థులకు రూ.10వేలు ఇవ్వడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఈ విషయమై 13ఏళ్లగా పోరాటం చేస్తున్నామని, ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప న్యాయం జరగడంలేదని వాపోయారు. 2022లో సమ్మె చేసినా వైసీపీ ప్రభుత్వం న్యాయం చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించాలని కోరారు.

ఏమార్చి.. ఇంట్లో నగలు కొట్టేసి..!

● ముగ్గురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు

● రూ.30 లక్షల బంగారు ఆభరణాలు, కారు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం

● మరో ముగ్గురి కోసం గాలిస్తున్నామన్న ఎస్పీ



స్వాధీనం చేసుకున్న నగలను చూపుతున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఇంటి డ్రైనేజీ పైపులు కొలతలు తీయాలంటూ యజమానిని పక్కకు తీసుకెళతారు. మరొకరు ఇంట్లోకి దూరి నగలు.. విలువైన ఆస్తులు మూటకట్టేస్తారు. ఇలా తిరుపతిలో దొంగతనానికి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాల్లో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.30 లక్షల విలువైన నగలు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను గురువారం తిరుపతిలో ఎస్పీ హర్షవర్ధన రాజు మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ మండలం కేశవాయనగుంటకు చెందిన పోలిన ధనమ్మ ఇంటి వద్దకు గతేడాది డిసెంబరు 20వ తేదీన కృష్ణ, అతడి తమ్ముడు శరత్, వేణుగోపాల్ వచ్చారు. మున్సిపల్ సిబ్బంది అని చెప్పారు. ఆ ఇంట్లో వాటర్ కనెక్షన్లు, డ్రైనేజీ పైపుల కొలతలు తీయాలని ఆమెను నమ్మించారు. ఇంటి పక్కన, వెనుక వున్న డ్రైనేజీ పైపులను చూపిస్తున్న ఆమె వెంట ఇద్దరు వెళ్లారు. మరొకడు ఇంట్లోకి వెళ్లి బీరువా, అల్మారాలో ఉన్న బంగారు నగలు, డబ్బు అపహరించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు.. అదనపు ఎస్పీ (క్రైం) నాగభూషణరావు ఆధ్వర్యంలో డీఎస్పీ శ్యాంసుందర్ పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి.. పాత వేలిముద్రలు, వారి కళ్ల ఫొటోల ఆధారంగా నిందితుల కోసం అనుమానిత ప్రాంతాల్లో గాలించారు. ఈ క్రమంలో తమకు అందిన సమాచారం మేరకు తిరుపతిలోని చెర్లోపల్లె రోడ్డులో తనిఖీలు చేస్తుండగా నిందితులు తారస పడ్డారు. క్రైం పోలీసుల వద్దనున్న సమాచారం ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. వారి నుంచి రూ 30 లక్షల విలువైన 280 గ్రాముల బంగారు నగలు, ఒక కారు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. ఈ కేసులో విశేష ప్రతిభ కనపరచిన క్రైం సీఐలు చిన్న పెద్దయ్య, శివకుమార్ రెడ్డి, ప్రకాష్ కుమార్, ఎస్ఐ ప్రదీప్ కుమార్ రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు రవిప్రకాష్, మురళి, మునిరాజులు, బసవరాజు రమేష్, గోపీకృష్ణ, వినాయక, కానిస్టేబుళ్ళు నాగరాజు శెట్టి, మోహన్, హరిప్రసాద్, సైబర్ క్రైం సిబ్బంది రాజశేఖర్‌ను ఎస్పీ అభినందించారు.

నిందితులది కర్ణాటక

నిందితులైన ఎ.కృష్ణ, అతడి తమ్ముడు శరత్, వేణుగోపాల్‌ది కర్నాటక రాష్ట్రం షిమోగా. ఈముగ్గురు స్నేహంగాఉండేవారు.రవి, గణేష్, ప్రశాంత్‌తో కలిసి చెడు అలవాట్లకు లోనయ్యారు. చిన్న చిన్న దొంగతనాలకు అలవాటు పడ్డారు.ఆతర్వాత బస్సుల్లో ప్రయాణికుల బ్యాగులు కొట్టేసేవారు. ఆ తర్వాత ఇళ్లలో దొంగతనాలు, మోటారు సైకిళ్ల చోరీలకు పాల్పడుతున్నారు. వీరిపై పలు చోట్ల కేసులు నమోదయ్యాయి. పలుసార్లు జైలుకు వెళ్లొచ్చారు.

30 రోజుల్లో తెలుగు రీడింగ్ ఛాలెంజ్

నేటినుంచి రెండు పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): 30 రోజుల్లో తెలుగు రీడింగ్ ఛాలెంజ్.. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తెలుగు భాషను స్పష్టంగా చదివేలా నేర్పించేందుకు ఉద్దేశించిన కార్యక్రమమిది. తిరుపతికి చెందిన భాస్కర్‌రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో తిరుపతి నగరం సంజయ్‌గాంధీ కాలనీలోని మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల, చంద్రగిరిలోని జేఆర్‌కేఆర్‌ఎం పాఠశాలలో శుక్రవారం నుంచి 30 రోజులపాటు పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నారు. ఈ మేరకు డీఈవో కేవీఎన్ కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పాఠశాలల్లోని 2, 3 తరగతుల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణనిచ్చి 30 రోజుల్లోనే 10వ తరగతి పాఠ్యపుస్తకాలను ధారాళంగా చదివేలా చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. ఆ తర్వాత అన్ని పాఠశాలల్లోనూ ప్రారంభించనున్నారు.

బాల్య వివాహాలతో భవిష్యత్తు అంధకారం



బాలికలకు అవగాహన కల్పిస్తున్న మండల మైనారిటీ అధ్యక్షులు మహ్మద్ గని

చౌడేపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో భవిష్యత్తు నాశనం చేసుకోకండని.. ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో గుర్తింపు.. గౌరవాన్ని పొందాలని టీడీపీ మైనారిటీ మండలాధ్యక్షులు మహ్మద్‌గని పేర్కొన్నారు. గురువారం ఆయన దుర్గసముద్రం పంచాయతీ దాదేపల్లె హైస్కూల్‌లో విద్యార్థులకు బాల్యవివాహాలతో కలిగే అనర్థాలు, నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతమ్మ, టీడీపీ నాయకులు అమీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మల్లేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు



మల్లేశ్వరస్వామి ఆలయం

రామకుప్పం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరిమానిపెంట గ్రామంలో పునర్నిర్మించిన మల్లికాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమవుతాయని గ్రామస్తులు తెలిపారు. శనివారం సాయంత్రం గణపతిపూజ, గోపూజ, గంగపూజ, మత్సంగ్రహణం, వాస్తుపూజ, వాస్తుబలి కార్యక్రమాలు జరుగుతాయి. ఆదివారం ఉదయం నుంచి గణపతిపూజ, సస్తివాచనం, కలశస్థాపన, గ్రామదేవత ఆరాధన, నవగ్రహ, దిక్పాలక, ప్రధానదేవత మంటపారాధన, జలాధివాసం, ప్రతిష్ఠామూర్తులకు అభిషేకం, హోమాలు, లఘుపూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయి. సోమవారం ఉదయం 4 నుంచి 5 గంటల వరకు ఆలయాల్లో మల్లికాంబ, మల్లేశ్వరస్వామి, మహాగణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నాగ, లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, కుంభాభిషేక కార్యక్రమాలు జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు.

దోమల నివారణకు మున్సిపాలిటీ చర్యలు



ఏకార్లపల్లెలో మలాథీన్ పిచికారీ

కుప్పం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలో విజృంభిస్తున్న దోమలపై మున్సిపాలిటీ యుద్ధం చేస్తోంది. పురపాలక సంఘం పరిధిలో రోజూ పరిసరాలను శుభ్రపరచి మలాథీన్ ఆయిల్‌ను పిచికారీ చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయాన్నే పారిశుధ్య సిబ్బంది వీధుల్లో తిరుగుతూ దోమల నివారణకు మందును పిచికారీ చేస్తున్నారు. ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేసి ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరిస్తున్నారు. దీంతో చెత్తరహిత మున్సిపాలిటీ కావడమేకాక దోమల నివారణ సులువవుతోంది. అయితే ఇంకా కొన్ని ప్రాంతాలలో దోమలు ఎక్కువగా ఉండి జ్వరాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఆయా ప్రాంతాలలోనూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి దోమలను నిర్మూలిస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

కుంభాభిషేక మహోత్సవాలకు విరాళం



కుంభాభిషేకానికి ఆనందరెడ్డిని ఆహ్వానిస్తున్న గ్రామస్తులు

రామకుప్పం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజోతి): రామకుప్పం మండలం ఆరిమానిపెంట లోని మల్లికాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవాలకు టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి రూ.10,116 విరాళంగా అందించారు. గురువారం గ్రామస్తులు కదిరప్ప, లోకేష్, సత్యనారాయణ తదితరులు ఆనందరెడ్డిని కలిసి కుంభాభిషేక మహోత్సవాలకు ఆహ్వానించారు.

చెన్నపట్నం చెరువు అభివృద్ధికి సహకరించండి



మంత్రిని కలిసిన సోమల టీడీపీ నాయకులు

సోమల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని చెన్నపట్నం చెరువు కట్ట వెడల్పు కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని టీడీపీ నాయకులు రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, రాంప్రసాద్‌రెడ్డిలను కోరారు. గురువారం విజయవాడలో వారిని కలిసి చెరువు కట్టతోపాటు పెద్దఉప్పరపల్లె - సోమల రోడ్ల అభివృద్ధికి సహకరించాలని విన్నవించారు. ఈ మేరకు రూ.5 కోట్ల నిధుల మంజూరుకు హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో ఇరికిపెంట మాజీ సర్పంచ్ శ్రీనివాసులు నాయుడు, డీలర్ చంద్రశేఖర్ నాయుడు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



దుర్గంకొండలో పర్యటించిన డీఎఫ్‌వో భరణి

సోమల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలోని దుర్గం కొండ గార్గేయ మహర్షి ఆలయాన్ని జిల్లా అటవీశాఖ అధికారిణి ఎస్. భరణి గురువారం సందర్శించారు. ఈనెల 26న మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా కొండపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు పర్యవేక్షించాలని, అటవీ ప్రాంతంలో భక్తులు మంటలు వేయరాదని సూచించారు. శివరాత్రి రోజున భక్తుల జాగరణ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్వో శ్రీరాములు, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, ఎంపీటీసీ సర్వేశ్వరమ్మ, బాలాజీ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జల్లికట్టు



పరుగులు తీస్తున్న ఎద్దు

శాంతిపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం కెనమాకులపల్లె, శివపురం గ్రామాల్లో గురువారం జల్లికట్టు నిర్వహించారు. ఎద్దులను నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. ఎద్దుల యజమానులకు నగదు బహుమతులను పంపిణీ చేశారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కరాటేలో పుంగనూరు విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో మాస్టర్ సదాశివ

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని పోర్ట్ స్టేడియంలో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో పుంగనూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ సదాశివ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో నేపాల్, భూటాన్, శ్రీలంక దేశాలలోని వెయ్యి మంది విద్యార్థులు కరాటే పోటీల్లో పాల్గొనగా పుంగనూరుకు చెందిన తొమ్మిది మంది ప్రతిభ కనబరిచారన్నారు. మీతిన్‌తేజారెడ్డి, చరణ్, హేమేష్, రిత్‌కృష్ణ, జ్ఞానదీప్, వరుణ్, చరణ్, శశాంక్, చక్రవర్తి పతకాలను సాధించినట్లు తెలిపారు.

మండల పరిషత్ కార్యాలయ తనిఖీ



ఎంపీడీవోతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజేంద్రబాలాజీకి సూచించారు. అనంతరం ఎస్సీ హాస్టల్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈ విద్యాసాగర్ పాల్గొన్నారు.

భూతగాదాల్లో ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజోతి): భూతగాదాల్లో ఇరువర్గాలు ఘర్షణ పడిన సంఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన గురువారం పుంగనూరు మండలంలో జరిగింది. వివరాలిలా.. మండలంలోని వనమలదిన్నె పంచాయతీ వి. కొత్తూరుకు చెందిన హరిబాబునాయుడు బెంగళూరులో వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సొంతగ్రామమైన వి. కొత్తూరులో ఉన్న పొలాన్ని అదే గ్రామానికి చెందిన నాగరాజుకు కౌలుకు ఇచ్చాడు. నాగరాజు కౌలుకు తీసుకున్న పొలంలో హరిబాబునాయుడు మామిడి మొక్కలు నాటడంతో తన వద్ద లాక్కున్నాడని ఆగ్రహించిన నాగరాజు తన స్నేహితులు నరేంద్ర, గణేశ్‌లతో కలిసి హరిబాబునాయుడిపై దాడి చేసి గాయపరిచారు. చుట్టుపక్కల పొలాల వారు గమనించి గాయపడిన హరిబాబునాయుడును పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

టపాసులు పేలి ఆరుగురికి గాయాలు



గాయపడిన వెంకటరమణ

గంగవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మృతదేహాన్ని తీసుకెళుతూ టపాకాయలు పేల్చుతుండగా ప్రమాదవశాత్తు ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. దండపల్లె గ్రామంలో గురువారం ఓ వృద్ధురాలు అనారోగ్యంతో మృతి చెందింది. సాయంత్రం మృతదేహానికి అంత్యక్రియలు చేయడానికి శ్మశానానికి తీసుకెళ్తూ టపాసుల బ్యాగ్ చేతిలో పెట్టుకొని పేలుస్తూ ఉండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. ఒక్కసారిగా టపాసులు పేలడంతో వెంకటరమణ, కుమార్ , గుర్రప్ప, చిన్నబ్బ, చిన్నన్న, సి. వెంకటరమణలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు



బడ్జెట్ విడుదలపై హర్షం వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే ఏపీ అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో పరుగులు తీస్తోందని.. కేంద్ర బడ్జెట్‌లోనూ రాష్ట్రానికి నిధులు విడుదల చేశారని పుంగనూరు బీజేపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం స్థానిక గోకుల్ సర్కిల్‌లో కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.5,936 కోట్లు, విశాఖ స్టీలుకు రూ.3,295 కోట్లు, విశాఖ పోర్టుకు రూ.730 కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. బీజేపీ నాయకులు నరసింహులు, జగదీష్, పెద్దమఠంబాబు, నానబాలకుమార్, శ్రీనివాసులు, మల్లికారాణి, అమరనాథ్, నాగరాజ, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల వసూళ్లపై దృష్టి సారించాలి

పుంగనూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల వసూళ్లపై దృష్టి సారించాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ సూచించారు. గురువారం స్థానిక ట్రావెల్స్ బంగ్లాలో పుంగనూరు, పలమనేరు, సదుం డివిజన్ పరిధిలోని ఈఈ, డీఈఈ, ఏఈలతో ఆయన సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. విద్యుత్‌లైన్లపై చెట్ల కొమ్మలు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసులుమూర్తి, డీఈఈలు శ్రీనివాసులు, చిన్నప్ప, నరేంద్రబాబు, ఏఈలు పాల్గొన్నారు.

రైతు హత్య కేసులో మరో నిందితుడి అరెస్టు

కల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఆవులపెద్దిరెడ్డిగారిపల్లి సమీపంలోని వ్యవసాయ పొలంలో జనవరి 18న జరిగిన హత్య కేసులో అదే నెల 24న ముగ్గురు నిందితులను అరెస్టు చేయగా గురువారం మరో నిందితుడు శివశంకర్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు... ఆవులపెద్దిరెడ్డిగారిపల్లికి చెందిన రైతు ప్రభాకర్‌కు వెంకటదాసరపల్లి పంచాయతీ అరికెలవారిపల్లికి చెందిన సుబ్బయ్యకు జనవరి 13వ తేదీన గొడవ జరిగింది. 18న సుబ్బయ్య పథకం ప్రకారం తన కుమారుడు శివశంకర్, తమ్ముడి కుమారుడు మహేష్, ఇదే పంచాయతీకి చెందిన గిరితో కలిసి వ్యవసాయ పొలం వద్ద ఉన్న రైతు ప్రభాకర్ వద్దకు చేరుకున్నారు. శివశంకర్ వెంట వచ్చిన గిరి, మహేష్ కత్తి తీసుకొని ప్రభాకర్‌పై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే సుబ్బయ్య, గిరి, మహేష్‌లను అరెస్టు చేశారు. శివశంకర్ గురువారం పులిచెర్ల బస్టాండు వద్ద ఉండగా పూతలపట్టు సీఐ కృష్ణమోహన్ ఆదేశాల మేరకు రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్సైలు కావలెను..!



● కుప్పం అర్బన్‌లో రెండు పోస్టులు ఖాళీ ● చోరీలతో జనం బెంబేలు

కుప్పం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పం అర్బన్ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు ఎస్సై పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు వరుస చోరీలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. మరోవైపు ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వీటన్నింటినీ సరిచేయడానికి అర్బన్ పరిధిలో ఉన్న ఒక్క సీఐ సరిపోవడంలేదు.

కుప్పం మున్సిపాలిటీతోపాటు కుప్పం మండలం కుప్పం అర్బన్ సర్కిల్ పరిధిలోకి వస్తాయి. గతంలో కుప్పం నియోజకవర్గం మొత్తం ఒకే సర్కిల్‌గా ఉన్నప్పుడు ఒక సీఐతోపాటు కుప్పం టౌన్‌కు ఒకరు, మండలానికి మరొకరు ఎస్సైలుగా పనిచేసిన రోజులు ఉన్నాయి. అయితే కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలను డివిజన్‌గా చేసిన తర్వాత పోలీస్ సర్కిళ్లనూ కుప్పం అర్బన్, కుప్పం రూరల్ అని రెండుగా విభజించారు. గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాలు కుప్పం రూరల్ పరిధిలోకి వస్తాయి. కుప్పం మున్సిపాలిటీతోపాటు కుప్పం రూరల్ మండలం అర్బన్ సరిల్‌లో చేర్చారు. ఒక సీఐ పోస్టు, రెండు ఎస్సై పోస్టులు మంజూరు చేశారు. ఈ రెండు సర్కిళ్లకు కలిపి డీఎస్పీని ఇచ్చారు. అంతా బాగానే ఉన్నా.. కుప్పం అర్బన్ సర్కిల్ ఏర్పడినప్పటి నుంచి ఇక్కడ పోలీసు సిబ్బందితోపాటు రెండు ఎస్సై పోస్టులు ఎప్పుడూ భర్తీ కాలేదు. ఒకవేళ పొరపాటున ఎప్పుడైనా భర్తీ అయినా, ఆ వెంటనే ఒకరిని బదిలీ చేసేసి, ఒక ఎస్సైని మాత్రమే ఉంచేవారు. గత కొంత కాలంగా రెండు ఎస్సై పోస్టులూ ఖాళీగానే ఉన్నాయి. అర్బన్ సీఐగా ఉన్న జీటీ నాయుడు బదిలీ తర్వాత కుప్పం రూరల్ సీఐ, అర్బన్‌కు ఇన్‌చార్జి సీఐలుగా వ్యవహరిస్తూ వచ్చారు. ఎట్టకేలకు గత నెల 6, 7 తేదీల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సమయంలో కుప్పం అర్బన్ సీఐగా పి.శంకరయ్య బాధ్యతలు తీసుకున్నారు. అయితే ఎస్సై పోస్టులు మాత్రం ఖాళీగా ఉన్నాయి.

● హడలెత్తిస్తున్న చోరీలు

కుప్పం పట్టణంతోపాటు మండలంలో సైతం ఇటీవల జరుగుతున్న చోరీలు జనాలను హడలెత్తిస్తున్నాయి. మూడు నాలుగు రోజుల క్రితం పట్టణంలోని ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో పట్టపగలే చోరీ జరిగి బంగారు, వెండి ఆభరణాలతోపాటు రూ.2 లక్షల వరకు నగదు దోచుకెళ్లారు. అలాగే పట్టణంలోని మరో నాయకుడి ఇంట్లో సైతం చోరీ జరిగినా ఆయన పోలీసు కేసు పెట్టకుండా మిన్నకుండిపోయారు. ఇవిగాక చిన్నాచితక దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. వరుసగా జరుగుతున్న చోరీలు కుప్పం ప్రజలకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. మరోవైపు గంజాయి, నాటుసారా ప్రభావం సైతం అధికంగానే ఉంటోంది. రెండు ఎస్సై పోస్టులు ఖాళీగా ఉండటంతో ఆయా నేరాలు అదుపు చేసి, శాంతిభద్రతల పరిరక్షణ చేయడం కష్టంగా మారుతోంది. ఇతర పోలీసు సిబ్బంది సైతం తక్కువగానే ఉన్నారు. కుప్పం అర్బన్ స్టేషన్ పరిధిలో ప్రస్తుతం 30 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో కనీసం ఐదారు మంది నిత్యం ఏదో ఒక కేసుకు సంబంధించి కోర్టు కేసులు, ఇతరత్రా విధుల నిమిత్తం బయట తిరుతుంటారు. అదనంగా మరో 12-15 మంది సిబ్బంది అవసరమైనా ఆమేరకు భర్తీ జరగడంలేదు. అర్బన్ సర్కిల్‌లో సాధారణంగా సిబ్బందికి ప్రోటోకాల్ డ్యూటీలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరిలలో ఎవరో ఒకరు కనీసం మూడు నెలలకోమారు కుప్పం వచ్చి వెళ్తున్నారు. వీరుగాక అప్పుడప్పుడూ మంత్రులు, వారి స్థాయి నాయకుల పర్యటనలతోపాటు జిల్లా కలెక్టర్, ఎస్పీల పర్యటనలు ఉంటూనే ఉంటాయి. ఈ ప్రోటోకాల్ విధులతోపాటు శాంతిభద్రతల పరిరక్షణ వంటి నిత్య విధులను చూసుకోవడానికి ఉన్న సిబ్బంది ఏమాత్రం సరిపోవడంలేదు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి కుప్పం అర్బన్‌లోని రెండు ఎస్సై పోస్టులతోపాటు ఇతర సిబ్బంది పోస్టులనూ భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరికీ స్వయం ఉపాధి పథకాలు

● ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలో అర్హులందరికీ స్వయం ఉపాధి పథకాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని.. కార్పొరేషన్ రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదిగేందుకు సహకారం అందించాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. గురువారం తన కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ రుణాలకు అందుతున్న అర్జీలను సైతం ఎమ్మెల్యే పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రానున్న వేసవిలో ఇప్పటి నుంచే తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పలమనేరు సమీపంలోని వైఎన్ఆర్ జలాశయానికి అనుబంధంగా నిర్మించనున్న గంగన్నశిరస్సు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ పూర్తికావడంతో అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం టౌన్‌హాల్, ఎస్టీపీ ప్రాజెక్టు తదితర పనులపై సమీక్షించారు. సమావేశంలో టీపీబీవో ఇందిర, స్నేహప్రియ, సర్వేయర్, ఆంజనేయులు, మెప్మా మేనేజర్ బాబా పాల్గొన్నారు.

కూటమి పాలనలోనే రహదారుల అభివృద్ధి



సిమెంట్ రోడ్డును పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల అభివృద్ధి జరుగుతుందని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని సింగిరిగుంట గ్రామంలో వేస్తున్న సీసీ రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో లాభాల కోసం గ్రామాల్లో నాణ్యత లేకుండా సీసీరోడ్డు వేశారని, ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణలో సీసీరోడ్డు పనులు జరుగుతున్నట్లు వివరించారు. ప్రజలకు అవసరమైన చోట పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీవీరెడ్డి, గంగాధర్, సుబ్రహ్మణ్యం, చైతన్య, మహేంద్ర, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్ఏటీవో డాక్టర్ వెంకటప్రసాద్

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కుష్టువ్యాధిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని జిల్లా వైద్యశాఖ డీఎల్ఏటీవో డాక్టర్ వెంకటప్రసాద్ సూచించారు. మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. కుష్టువ్యాధి నివారణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం రికార్డులు పరిశీలించి వైద్యాధికారి అరుణ్‌కుమార్‌కు సూచనలిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ అనిల్, డీపీఎంవో జాన్, ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

హంస వాహనంపై ఊరేగిన వేణుగోపాలుడు

వి.కోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం స్వామి వారికి వివిధ అభిషేకాలు చేసి అలంకరించారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై కొలువు తీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవాలను నిర్వాహకులు పర్యవేక్షించారు.

వైభవంగా ధ్యానాభిరాముడి బ్రహ్మోత్సవాలు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కార్వేటికొండ ధ్యానాభిరామ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం హంసవాహనంపై స్వామివారు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు స్వామి వారి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని హంసవాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్యాయత్నం

పుంగనూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త మద్యం మత్తులో గొంతుకోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం రాత్రి పుంగనూరులో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. స్థానిక నక్కబండలో కాపురమున్న భార్యాభర్తలు బాలు(30), గిరిజ వారం రోజుల క్రితం గొడవలు పడ్డారు. దీంతో భార్య అలిగి పుట్టింటికి వెళ్లింది. ఈక్రమంలో రాత్రి మద్యం మత్తులో బాలు 'నా భార్య కావాలి' అని అరుస్తూ మనస్తాపంతో కత్తితో గొంతుకోసుకోవడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. స్థానికులు వెంటనే 108 వాహనంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వైద్యం చేయించుకోకపోవడంతో పోలీసులు నచ్చజెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ భరించలేక లారీ డ్రైవర్ ఆత్మహత్య



షౌకత్‌ఆలీ (ఫైల్‌ఫొటో)

పలమనేరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటి గంటావూరులో నివాసముంటున్న లారీడ్రైవర్ షౌకత్ ఆలీ(40) అప్పుల బాధ భరించలేక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. షౌకత్‌ఆలీ మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

పలమనేరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా కేవీబీపురం మండలం మఠం గ్రామం వద్ద దళిత మాజీ సర్పంచ్ వెంకటయ్య దంపతులపై దాడిచేసి వారిని గాయపరచిన వారిని వెంటనే అరెస్టు చేయాలని జాతీయ మానవహక్కుల సంఘం అవినీతి నిర్మూలన సంస్థ అధ్యక్షులు డీవీ మునిరత్నం డిమాండు చేశారు. గురువారం పలమనేరులోని సంస్థ కార్యాలయంలో మాట్లాడారు. రోజురోజుకు దళితులపై దాడులు పెరుగుతున్నాయని, దాడులు జరిగిన ప్రతిసారి ప్రజాసంఘాలు ఆందోళనలు చేపడితే తప్ప కేసులు నమోదు, అరెస్టు జరగడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇకనైనా పోలీసులు స్పందించి వెంకటయ్య దంతపతులపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో డి.సుబ్రహ్మణ్యం, సోమశేఖర్, సరస్వతి, శ్యామల, రాజా, ఆనంద్ గంగప్ప, బుజ్జి, శ్రీనివాస్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని యువకుడి మృతి




మృతిచెందిన ప్రతాప్‌కుమార్

పలమనేరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పలమనేరు-మండీపేట కోటూరు రహదారిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండీపేట కోటూరు గ్రామానికి చెందిన ప్రతాప్‌కుమార్(22) మృతిచెందాడు. పలమనేరు నుంచి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రతాప్‌కుమార్‌ను పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పలమనేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ..

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె - వి.కోట ప్రధాన రహదారిపై ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో గురువారం గుర్తుతెలియని వాహనం ఢీకొని మిట్టపల్లె గ్రామానికి చెందిన వృద్ధుడు మునెప్ప(69) మృతిచెందారు. ఆలయానికి వెళ్లి తిరిగి నడచివస్తుండగా ప్రమాదం జరిగింది. బైరెడ్డిపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిక వృద్ధుడి..



వెంకటప్పనాయుడు (ఫైల్ ఫొటో)

చౌడేపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): శతాధిక వృద్ధుడు, బోయకొండ గంగమ్మ ఆలయం మాజీ చైర్మన్, సీనియర్ న్యాయవాది శివప్పనాయుడు తండ్రి కంచం వెంకటప్పనాయుడు (102) గురువారం మృతి చెందాడు. మండలంలోని దిగువపల్లె పంచాయతీ అప్పినపల్లెకు చెందిన వెంకటప్పనాయుడు మాజీ ఎంపీటీసీగా విధులు నిర్వహించి ప్రజలకు సేవలు అందించారు.

విద్యార్థులకు ఉసిరికాయల పంపిణీ



ఉసిరికాయల ఉపయోగాలపై వివరిస్తున్న డా.కరీముల్లా

సదుం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత శాస్త్రజ్ఞులు కలకడ కరీముల్లా తన తోటలో సేంద్రియ వ్యవసాయ పద్ధతులతో సాగు చేసి పండించిన 175 కిలోల ఉసిరికాయలను సదుం ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా గురువారం పంపిణీ చేశారు. ఉసిరికాయలతో కలిగే ఆరోగ్య విషయాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం జైకుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారా తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోండి: డీఎస్పీ


కేసుల వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ అజీజ్

పాలసముద్రం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని నగిరి డీఎస్పీ అజీజ్ ఆదేశించారు. గురువారం ఆయన పాలసముద్రం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సక్రమంగా విధులు నిర్వహించాలని చెప్పారు. రాత్రి పూట గ్రామాల్లో గస్తీ తిరగాలన్నారు. మండలం తమిళనాడుకు సరిహద్దులో ఉండటం వల్ల అక్రమ రవాణాపై నిఘా పెట్టాలని చెప్పారు. ఎస్‌ఐ చిన్న రెడ్డెప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

పెయ్యదూడల పెంపకంపై మెలకువలు అవసరం: జేడీ


మహిళా పాడిరైతుకు బహుమతి ప్రదానం చేస్తున్న ప్రభాకర్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పెయ్యదూడల పెంపకంపై పాడి రైతులకు మెలకువలు అవసరమని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ప్రభాకర్ అన్నారు. గురువారం కూర్మాయిపల్లెలో సంకరజాతి(జెర్సీ)పెయ్యదూడల ప్రదర్శన జరిగింది. అనంతరం కమిటీ ఎంపిక చేసిన ఉత్తమ పెయ్యదూడల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపసంచాలకుడు డాక్టర్ ఆరీఫ్, డీఎల్‌డీవో ఈవో డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం, ఏడీ డాక్టర్ షేక్ ఆసీఫ్, డాక్టర్ ఝాన్సీ, గోపాలమిత్ర రమేష్, మోహన్, పావని పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నాయకుడి జన్మదిన వేడుకలు


మోహన్ నాయుడు దంపతులకు గజమాలతో సన్మానం

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక వేత్త, టీడీపీ నాయకుడు రాళ్లపల్లి మోహన్‌నాయుడి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కొత్త వెంకటాపురం గ్రామంలో భారీ కేక్‌ను పూతలపట్టు, చంద్రగిరి ఎమ్మెల్యేలు మురళీమోహన్, పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు సమక్షంలో కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. మోహన్‌నాయుడు దంపతులను అభిమానులు గజమాలతో సత్కరించారు. టీడీపీ నాయకులు ఎన్పీ జయచంద్ర నాయుడు, ఎన్పీ సూరి నాయుడు, కోదండయాదవ్, ధరణీ ప్రసాద్ నాయుడు, జనార్దన్ గౌడ్, గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖర్‌బాబు, జ్ఞానచౌదరి, మాన్యం రవి, యువరాజ్, కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

స్మార్ట్ లాక్‌ల వినియోగంపై ప్రజలకు అవగాహన


ప్రజలకు స్మార్ట్ లాక్‌లను అందజేసిన ఎస్‌ఐ ఈశ్వర్ తదితరులు

యాదమరి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ అలారం లాక్‌లను ఏర్పాటు చేసుకుంటే చోరీలకు కళ్లెం వేయవచ్చని ఎస్‌ఐ ఈశ్వర్ తెలిపారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో స్మార్ట్ లాక్‌లపై అవగాహన కల్పించారు. ప్రజలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి వాలెంటైన్స్ డే వారోత్సవం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వాలెంటైన్స్ డే వారోత్సవం శుక్రవారం నుంచి మొదలుకానుంది. శుక్రవారం రోస్‌డే, శనివారం ప్రపోస్ డే, ఆదివారం చాక్లెట్ డే, సోమవారం టెడ్డీడే, మంగళవారం ప్రామిస్‌డే, బుధవారం హగ్‌డే, గురువారం కిక్‌డే, శుక్రవారం వాలెంటైన్స్ డే జరగనున్నాయి. ఈ మేరకు నగరంలో పూలవ్యాపారులు, స్వీట్, కేక్ స్టాల్ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

13న షబేబరాత్ పండుగ

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): షబే బరాత్ పండుగను ముస్లింలు ఈనెల 13వ తేదీన నిర్వహించుకోనున్నట్లు ప్రభుత్వ ఖాజీ సయ్యద్ మొహమ్మద్ కమాలుల్లా జుహారి లతీఫ్ జునేది తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఇసుక దోపిడీ

తమిళనాడుకు అక్రమంగా తరలించేస్తున్నారంటున్న స్థానికులు


డంప్ చేసిన ఇసుకను తీసుకెళ్లిన దృశ్యం


నారపరాజు కండ్రిగ వద్ద డంప్ చేసిన ఇసుక

పక్కా గృహాల నిర్మాణం పేరుతో ఇసుక దోపిడీ జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నారపరాజుకండ్రిగలో గతంలో జగనన్న కాలనీ పేరుతో సుమారు 30 ఇళ్లు మంజూరు చేశారు. కానీ పది ఇళ్ల నిర్మాణం కూడా ప్రారంభం కాలేదు. ప్రస్తుతం ఈ కాలనీలో పక్కా గృహనిర్మాణం అంటూ రోజూ పర్మిట్ తీసుకుంటూ నారపరాజుకండ్రిగను దాటుకుని మామిడి తోపుల్లో ఇసుక డంప్ చేసి, రాత్రి సమయాల్లో తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కేవీశ్రీరామాపురం కుశస్థలి నది నుంచి రోజూ కొందరు నేరుగా తమిళనాడు సరిహద్దులకు సరఫరా చేస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- విజయపురం, ఆంధ్రజ్యోతి

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


వెదురుకుప్పంలో ఎరువులను తనిఖీ చేస్తున్న శివకుమార్, ప్రవీణ్‌కుమార్, వనిత

వెదురుకుప్పం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలంలోని ఎరువుల, పురుగు మందుల దుకాణాలతోపాటు రైతు సేవా కేంద్రాల్లోని ఎరువుల నిల్వలను వ్యవసాయాధికారులు ప్రవీణ్‌కుమార్(తవణంపల్లి), వనిత(వెదురుకుప్పం) కలసి ఏడీఏ శివకుమార్ గురువారం తనిఖీలు చేశారు.

పెనుమూరు: ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ తెలిపారు. గురువారం పెనుమూరులోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ కేసీ పల్లె, రామకృష్ణాపురం, గుంటిపల్లె రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. శుక్రవారం సామిరెడ్డిపల్లె, పెనుమూరు, చింతపెంట కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. డిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.

అకారణంగా విధుల నుంచి తొలగించారు: ఆర్పీ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తనను అకారణంగా విధుల నుంచి తొలగించారని మెప్మా పరిధిలో విధులు నిర్వహిస్తున్న 11వ డివిజన్ ఆర్పీ అనిత ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. అధికారులు తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తున్నానని చెప్పారు. సరైన కారణాలు చూపకుండా మెప్మా సిటీ మిషన్ మేనేజర్ రమణ తనను విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు.

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు రిజర్వేషన్‌పై హర్షం

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్ కేటాయిస్తూ ఆమోదించడంపై టీడీపీ నాయకులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వీరిలో యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, పార్లమెంట్ లీగల్‌సెల్ కార్యదర్శి లాయర్ శరవణకుమార్, మండల బీసీసెల్ అధ్యక్షుడు జ్యోతియాదవ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు లోకమ్మ, పాతపాళ్యం మాజీ సర్పంచ్ లోకనాధంయాదవ్, బీసీ నేతలు మునిరాజులు యాదవ్, చంద్రబాబుగౌడ్, నారాయణస్వామి, గాయత్రి, భువనేశ్వరి, రాఘవేంద్రగౌడ్ తదితరులు ఉన్నారు.

యూరియా నిల్వలపై ఆందోళన వద్దు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): యూరియా నిల్వలపై రైతులు ఆందోళన చెందొద్దని మండల వ్యవసాయ విస్తరణ అధికారి సాదరయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రెండ్రోజుల్లో రైతు సేవా కేంద్రాల్లోకి సరిపడా యూరియా అందుబాటులోకి వస్తుందని చెప్పారు. యూరియా అధిక మోతాదులో వాడరాదని, చీడ,పీడల ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. వరి పంటకు ఎకరాకు 30-35 కిలోలను మాత్రమే వాడాలని సూచించారు.

బీరు బాటిళ్లతో దాడి చేసిన నిందితుల అరెస్టు


నిందితుల వివరాలు తెలియజేస్తున్న సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ వెంకట సుబ్బయ్య

వెదురుకుప్పం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బీరు బాటిళ్లతో దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసినట్టు చేసినట్లు సీఐ హనుమంతప్ప, ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య గురువారం తెలిపారు. వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లెకి చెందిన శంకర్‌రెడ్డి(45) ఈనెల మూడో తేదీన మోటారు సైకిల్‌పై వెళ్తుండగా బీరు బాటిళ్లతో దాడికి పాల్పడ్డారు. నిందితులైన బ్రాహ్మణపల్లె కాలనీకి చెందిన ఎం.రజనీకాంత్(19), మారేపల్లె కాలనీకి చెందిన జి.పవన్(19), చింతలగుంట గ్రామానికి చెందిన ఎం.జ్యోతీశ్వర్‌రెడ్డి అలియాస్‌మహేష్(19), చవటగుంటకాలనీకి చెందిన గణేష్‌ను అరెస్టు చేసి.. రిమాండుకు తరలించామని చెప్పారు.

కారు ఢీకొని రైతు దుర్మరణం

పూతలపట్టు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఓ రైతు దుర్మరణం చెందాడు. పి.కొత్తకోట పంచాయతీ మోటకంపల్లె గ్రామానికి చెందిన బాలకృష్ణమ నాయుడు(80) గురువారం రాత్రి పొలం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి కాలినడకన బయల్దేరాడు. గ్రామసమీపాన రోడ్డు దాటుతుండగా చిత్తూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సీఐ కృష్ణమోహన్ కేసు నమోదు చేశారు.

నాటు తుపాకి స్వాధీనం: ఇద్దరి అరెస్టు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నాటు తుపాకీని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం మధ్యాహ్నం అటవీ జంతువులను వేటాడేందుకు కేఎం కండ్రిగ అటవీ ప్రాంతంలో ఇద్దరు వేటగాళ్లు ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో సీఐ తన సిబ్బందితో వెళ్లగా ఇద్దరు వ్యక్తులు నాటు తుపాకీతో పట్టుబడ్డారు. పట్టుబడ్డ వారిలో.. గోపి (గుడియాత్తం తాలూకా విడదోశపాళ్యం), ఆనంద్ (బంగారుపాళ్యం మండలం కేఎం కండ్రిగ)గా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పానాటూరులో 'పొలం పిలుస్తోంది'

గుడిపాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పానాటూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వరి రైతులు తమ పొలాల్లో సేంద్రియ ఎరువులు వినియోగిస్తే అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారి మాధవి తెలిపారు. సర్పంచ్ పల్లవి, వ్యవసాయ సహాయకులు తులసీరామ్‌రెడ్డి, ఏహెచ్‌ఏ చంద్రశేఖర్‌రైతులు నిత్యానంతం, చందు తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ శ్రేణులకు అందుబాటులో ఉంటా'



వెదురుకుప్పం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ శ్రేణులకు అందుబాటులో ఉంటానని జీడీనెల్లూరు నియోజకవర్గ మహిళా విభాగ అధ్యక్షురాలిగా నియమితురాలైన వెదురుకుప్పం ఎంపీటీసీ సభ్యురాలు ఎన్.రాధిక తెలిపారు. గురువారం రాత్రి వైసీపీ శ్రేణులు ఆమెను సన్మానించాయి. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పేట ధనంజయులురెడ్డి, బట్టే సుబ్రహ్మణ్యం, రామయ్య, చిరంజీవిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు పేట రమేష్‌రెడ్డి, పేట నీరజ, భాస్కర్‌రెడ్డి, జయరామిరెడ్డి, మోహన్‌రెడ్డి, వాసు, చెన్నారెడ్డి, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రమట్టి అక్రమంగా తరలింపు

● కోదండరామాపురంవాసుల ఆవేదన

పాలసముద్రం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో ఉన్న డీకేటీ భూముల్లో నుంచి ఎర్రమట్టిని కొందరు వైసీపీ నాయకులు అక్రమంగా తరలిస్తున్నారని కోదండరామాపురం వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గురువారం జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. నరసింహాపురం పంచాయతీలోని అయ్యవారికండ్రిగలో ఇటుకలు తయారు చేయడానికి ఈ మట్టిని వాడుతున్నారన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా తరలిస్తున్నారని సంబంధిత అధికారులు విచారించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చెరువు కాల్వలో పూడికతీత పనులు ప్రారంభం


గ్రామస్తులు, కృష్ణమనాయుడితో పనులపై చర్చిస్తున్న ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆవలకొండ గ్రామంలోని చెరువుకాల్వలో పూడికతీత పనులను గురువారం ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కాల్వలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో వర్షపు నీరంతా పొలాలపైపడి రైతులతోపాటు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై 20 రోజుల కిందట ఎంపీడీవోకు గ్రామస్తులతోకలిసి పార్లమెంట్ టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, నియోజకవర్గ ముస్లిం మైనారిటీ ప్రధానకార్యదర్శి నియాజ్ అలీ విన్నవించారు. వర్షపునీరు తూగుండ్రం చెరువుకు వెళ్లేలా చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో కాల్వలో చెత్తాచెదారాన్ని తొలగించే పనులు మొదలుపెట్టారు. కృష్ణమనాయుడు, తూగుండ్రం సర్పంచ్ శ్రీబాబు, సింగిల్‌విండో సొసైటీ మాజీ వైస్ ఛైర్మన్ నరసింహులునాయుడు, పంచాయతీ కార్యదర్శులు మురళి, కుమార్, టీడీపీ నేతలు ఫెరోజ్ అలీ, అత్తాహర్‌అలీ, అలీఅబ్బాస్, జోహర్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో తనిఖీలు

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): 49.కొత్తపల్లెమిట్టలోని అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం జిల్లా శిశు సంక్షేమశాఖ పీడీ వెంకటేశ్వరి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీ సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ వెంకటేశ్వరి →




రోడ్డుపై మురుగు

ఇబ్బంది పడుతున్న రాసప్పకాలనీవాసులు



నగరి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):నగరి మున్సిపాలిటీ పరిధిలోని రాసప్పకాలనీలో మురుగు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. దీనివల్ల దుర్గంధంతోపాటు దోమల బెడద ఎక్కువైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిమెంటురోడ్డు కూడా దెబ్బతిన్నదని చెప్పారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వాపోయారు.

శతాధిక వృద్ధుడి మృతి


వెంకటప్పనాయుడు (ఫైల్ ఫొటో)

చౌడేపల్లె, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): శతాధిక వృద్ధుడు, బోయకొండ గంగమ్మ ఆలయం మాజీ చైర్మన్, సీనియర్ న్యాయవాది శివప్పనాయుడు తండ్రి కంచం వెంకటప్ప నాయుడు (102) గురువారం మృతి చెందాడు. మండలంలోని దిగువపల్లె పంచాయతీ అప్పినపల్లెకు చెందిన వెంకటప్పనాయుడు మాజీ ఎంపీటీసీగా విధులు నిర్వహించి ప్రజలకు సేవలు అందించారు.

సంక్షిప్తంగా..

క్యాన్సర్‌పై అవగాహన

పెనుమూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సీహెచ్‌సీలో రోగులు, ప్రజలకు క్యాన్సర్‌పై గురువారం అవగాహన కల్పించారు. డాక్టర్ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. మీ ఇంటి వద్దకు వస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ బృందానికి సహకరించాలని కోరారు. డాక్టర్ సంధ్య, హెడ్ నర్స్ నిర్మలాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నిర్మూలనకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం తన కార్యాలయంలో ఎంపీడీవో మోహన మురళి ఆవిష్కరించారు. వైద్యులు బాలసుబ్రమణ్యం రెడ్డి, గౌరి, గిరి, ఎంఈవోలు అరుణాచాలం రెడ్డి, సబర్మతి, సిబ్బంది పాల్గొన్నారు.

'శిఖండి' దర్శకుడికి సత్కారం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరవాసి, శిఖండి సినీ నిర్మాత, దర్శకుడు కోడి కిషోర్‌ను జిల్లా బలిజ సేవా సంఘం ప్రతినిధులు గురువారం సత్కరించారు. సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వీకే విశ్వనాథ్, ఓం.రాందాస్, ఆరణి తులసీరాం తదితరులు పాల్గొన్నారు. కోడి కిషోర్ మాట్లాడుతూ.. తమ సినిమాకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించిందన్నారు.

గుండెను పదిలంగా చూసుకోండి

ఐరాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ గుండెను పదిలంగా చూసుకోవాలని పి.కొత్తకోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) డాక్టర్ కుమార్‌రాజ అన్నారు. గురువారం ఐరాల పీహెచ్‌సీలో స్టెమి (ఎస్టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్ఫార్‌క్షన్) ప్రాజెక్టుపై అవగాహన కల్పించారు. రూ.45వేల విలువైన టెనెక్టెప్లెస్ ఇంజక్షన్ పి.కొత్తకోట ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా వేస్తారని తెలియజేశారు. వైద్యులు వెంకటేశ్వరరావు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

దళితవాడకు దారి చూపండి

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తమ దళిత వాడకు దారి చూపాలంటూ పెనుమూరు మండలం పులికల్లు పంచాయతీ చెర్లోపల్లె దళితులు విజ్ఞప్తి చేశారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. గ్రామానికి వెళ్లే దారిలో అగ్రకులాల వారు రాతి కూసాలు నాటి ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే రాతి కూసాలను తొలగించాలని తహసీల్దార్‌కు ఆదేశాలు జారీచేసినా ఫలితం లేదన్నారు. కలెక్టర్ చొరవ చూపి తమకు న్యాయం చేయాలని కోరారు. చెంగల్రాయలు, దాము, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై దృష్టి పెట్టండి: డీఎల్‌పీవో

యాదమరి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టి పెట్టాలని సిబ్బందిని డీఎల్‌పీవో పార్వతి ఆదేశించారు. గురువారం యాదమరి, కీనాటంపల్లి, 14 కండ్రిగ, 184 గొల్లపల్లిలో చెత్త నుంచి సందప తయారీ కేంద్రాలను పరిశీలించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్డు పక్కన పేడదిబ్బలు చూడాలన్నారు. ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి, కార్యదర్శులు ప్రకాష్, దివ్య, పూర్ణిమ పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన బీసీ నేత షణ్ముగం

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్‌ను డిల్లీలోని ముఖ్యమంత్రి అధికార నివాసంలో బుధవారం రాత్రి చిత్తూరు కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్, బీసీ సంక్షేమ సంఘం దక్షిణాది రాష్ట్రాల ఇన్‌చార్జి షణ్ముగం కలిశారు. ఆయనవెంట జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఉన్నారు. బీసీ వర్గాల డిమాండ్లను మంత్రి వద్ద ప్రస్తావించి, మద్దతు కోరారు.

పేదలకు ఇళ్ల స్థలాలివ్వండి: సీపీఐ

విజయపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఈ మేరకు నిరసన తెలిపారు. పాతార్కాడు ఆదిఆంధ్రవాడవాసులు ఇంటి స్థలాలు లేకుండా ఇబ్బంది పడుతున్నారని తహసీల్దార్ కిరణ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోదండయ్య, నాయకులు రవి, ఏసుపాదం, రాధ, భూదేవీ, ఝాన్సీ, కవిత, మధు, మౌనిక, మురగమ్మ, అమ్ములు, ప్రభ, లావణ్య, హేమావతి తదితరులు పాల్గొన్నారు.